ఆంధ్రమహిళ




Andhra Mahila Dec. 1963-50 nP


ఆంధ్రమహిళాసభ-మద్రాసు



వసంతోత్సవము: విదేశ విద్యార్థులతో మా సభ కార్యకర్తలు



[illegible] బొమ్మల కొలువు



ఆంధ్ర మహిళ

సంపుటి 19 డిశంబరు 63 సంచిక 12

విషయసూచిక

ముఖచిత్రం :

కీ. శే. శ్రీ కెన్నడీ

ఆంధ్ర మహిళ

7 ఎ, రోజరీ చర్చిరోడ్, శాంథోమ్ మద్రాసు

పెట్టు శుభపాదం

(మరది స్వాగతం)

పెట్టు పాదం
పెట్టు-
మాయింటి
మహాలక్ష్మి !
పెట్టుశుభపాదం-

మంజీరము మోయ,
మట్టెలు లయవేయ-

పెట్టు శుభపాదం-

లత్తుకపూత మెరయ,
లాలిత్యము తెలియ-

పెట్టు శుభపాదం-

కుచ్చెళ్ళు జీరాడ,
కుతుకమ్ము తారాడ-

పెట్టు పాదం
వదినా, పంచి
పెట్టు మోదం-

పొరపులు దులిపించు
పొత్తులు హత్తించు
మనసులు వెలిగించు,
మనుషుల మనిపించు-

పెట్టు పాదం
వదినా, పంచి
పెట్టు మోదం-

ఈసులు పెరికించు
ఇష్టం మొలిపించు
ఎడదలు నిండించు,
ఎలమిని పండించు-

పెట్టు పాదం
వదినా, చూ
పెట్టు నీ ప్రభ-

ఉవ్విళ్లూరుతున్న
హృదయ వల్లభునితో
చేపట్టు గార్హస్థ్యం.
చెలాయించు పెత్తనం-

పెట్టు పాదం
వదినా, చూ
పెట్టు నీ ప్రభ-

ఆశలు పెట్టుకున్న
అత్త మామలకు
ఇప్పించు వానప్రస్థం,
ఇంటిలోనే ఒకపంచ-

పెట్టు పాదం
వదినా, చూ
పెట్టు నీ ప్రభ-

వీరు ఆడపడుచులు,
కారు కోడిపుంజులు-
కాసుకో దూకుళ్ళు,
వేసుకో బుట్టలో-

వదినమ్మా, మ
రది నమ్మా, ల
క్ష్మణు డనుకొమ్మా,
మచ్చిక యిమ్మా-
పెట్టు శుభపాదం, సరి
పెట్టు మా వివాదం-

తప్పటడుగుల
చొప్పు కనక,
తొక్కు- పలుకులు
చెవిని బడక-
ముద్దు తీరక,
ప్రొద్దు పోవక-
పెనగులాట
పెద్ద లింట-

పెట్టు శుభపాదం, కని
పెట్టు మాకు వినోదం-

చిట్టి పాపలు కలగాలి,
చీదర వై తొలగాలి-
సందడి దండడించాలి,
డెందములానందించాలి-

పెట్టు పాదం,
పెట్టు.
మాయింటి
మహాలక్ష్మి-
పెట్టు శుభపాదం!

—"నళినీ"

ఆంధ్రమహిళ

వ్యవస్థాపకురాలు : దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపుటి 19 :: డిశంబరు 1963 :: సంచిక 12

ఆరిన ఆశాదీపం

అమెరికన్ అధ్యక్షుడు జాన్. యఫ్. కెన్నడీ దుర్మరణం సమస్త ప్రపంచపు మూలమూలలనీ దుఃఖాంబుధిలో ముంచినది. కెన్నడీ ప్రాక్ పశ్చిమ దేశాలకీ, అభ్యుదయ వర్ధమాన దేశాలకీ, సామ్యవాద ప్రజాస్వామ్య దేశాలకీ మధ్యన స్నేహ వారధివలె నిలిచారు. అధ్యక్షపదవిలో వున్న ఈ కొద్దికాలంలోనే ఆయన అణ్వాయుధ భయాందోళనకి గురిఅవుతున్న మానవాళికి వెలుగునీ, ఆశాజ్యోతినీ ప్రదీప్తి చేయగలిగారు. ప్రాక్ పశ్చిమ ఖండాల భావిఆశలు యీ మహామహునిపై కేంద్రీకరింపబడివున్న కాలంలో వారిని దారుణహత్యకు గురిచేయడం - మానవజాతి తల వంచుకోవలసిన, సిగ్గుపడవలసిన విషయం.

అతిచిన్నవయసులో అధ్యక్షపదవి అలంకరించిన యీ మహాపురుషుడు రచయిత, సైనికుడు, పత్రికా విలేఖరి, సహృదయుడు, వున్నతుడు అన్నిటికీ మించి యిద్దరి పసివాళ్ళకి తండ్రి, ఇన్ని సుగుణసంపదలతో పాటు రాజకీయ చతురతా, కార్యదక్షతా కెన్నడీని ఒక గణనీయ వ్యక్తిగా చేశాయి. అధ్యక్షపీఠంలో వున్నది రెండేళ్లే అయినా - యీ రెండేళ్లలో మానవాళి భవిష్యత్‌ని, ఆశాదృక్కులని తన వైపుకి తిప్పుకొనగలిగారు.

కోటిమానవులు, తన స్వదేశస్తులు అయిన నీగ్రోలపట్ల జరుగుతున్న అత్యాచారాలని అన్యాయాలని అరికట్టే ప్రయత్నంలో, తన పూర్వీకుడైన అబ్రహీమ్ లింకన్ వలె - మూఢుల అకృత్యానికి బలి అయిపోయారు.

అబ్రహీమ్ లింకన్, బాపూజీ, కెన్నడీ వంటి వ్యక్తులకి భౌతికమరణమేగాని - వారి ఆశయాలకు మరణం వుండదు. ఆ ఆశయాలు సర్వమానవాళికి ధృవతారలవలె యీ అణుయుగంలో దారిచూపుతూ వుంటాయి. శ్రీ కెన్నడీ మహనీయులకోవకీ, యుగపురుషులకోవకీ చెందుతారు. సుగుణనిధి అయిన కెన్నడీ ఆత్మశాంతికొరకై అఖండ ప్రజానీకంతో పాటు మేమూ భగవంతుని ప్రార్థిస్తున్నాము.

— మాలతీ చందూర్
గౌరవ సంపాదకులు

ఆంధ్రమహిళాసభ

యూనివర్శిటీరోడ్, విద్యానగర్. హైదరాబాద్.

ఆక్జిలరీనర్స్ మిడ్‌వైఫ్‌రీ కోర్సు

స్త్రీ అభ్యర్థుల వద్దనుంచి ఆక్జిలరీనర్సు మిడ్‌వైఫ్ కోర్సు శిక్షణ పొందుటకు దరఖాస్తులు కోరబడు చున్నవి. 1964 జనవరినుంచి ఆంధ్రమహిళా సభ హైద్రాబాద్‌లో ఈ విద్యా శిక్షణ ప్రారంభమగును. ఉండగల ఖాళీలు 50 (యాబది)

1. ఈ శిక్షణకిగల కనీస విద్యార్హతలు. 8. వ. తరగతిలో వుత్తీర్ణులు కావలెను. అంతకిమించిన విద్యార్హతలుగల వారికి ప్రిఫరెన్సు యివ్వబడును.

2. వయస్సు శిక్షణలో చేరునాటికి 17 సంవత్సములకు తక్కువ వుండరాదు. ముప్పై సంవత్సరములకు మించి వుండరాదు.

3. శిక్షణాకాలము రెండు సంవత్సరములు.

4. స్టైయిఫండులు. అన్ని అలవెన్సులలో నెల ఒక్కింటికి 60 రు. చొప్పున యివ్వబడును.

5. బోధనాభాష తెలుగు. షరా: అధిక విద్యార్హతలు గలవారికి అవకాశము యివ్వబడును. ఎన్నుకోబడిన విద్యార్థినులు, నిర్ణయింపబడిన తేదీనాడు తమ స్వంతఖర్చుపైన, యింటర్‌వ్యూకి హాజరు కావలసివుంది.

6. ఈ విద్యాశిక్షణకు అప్లికేషన్ పెట్టదలచుకున్నవారు, అచ్చుఫారముల మీద పంపవలెను. సదరు ఫారములు ఒకరూపాయి చెల్లించి, కన్వీనర్, ఆంధ్రమహిళాసభ, విద్యానగర్, వద్దనుంచి పొందవచ్చును. విద్యార్థినులు అప్లికేషన్ ఫారములను స్వదస్తూరితో పూరించి, 1963. డిశంబరు 5 వ. తేదీ సాయంత్రం 5 గం॥ లోపునగానీ అందుకు ముందుగాగాని ఆంధ్రమహిళాసభ విద్యానగర్-హైద్రాబాద్‌కు అందునట్లు పంపవలెను.

ఆ గడువు తరువాత అందిన అప్లికేషనులు పరిశీలింపబడవు.

(సం॥) సి. సరస్వతీరావు
కన్వీనరు.

కావేరి

వింధ్యాచలములకు దక్షిణముననున్న పుణ్యనదులలో మహానది ఓడ్రులకును ఆంధ్రులకును, గోదావరీ కృష్ణవేణులు మహారాష్ట్రులకును ఆంధ్రులకును, తుంగభద్ర కర్ణాటులకును ఆంధ్రులకును వలె కావేరి కర్ణాటకులకును దాక్షిణాత్యులకును సంస్కృతీనిలయము; అందును ద్రావిడ దేశమునకు ఆయువుపట్టు; ద్రవిడ సంస్కృతికి పట్టుంగొమ్మ; ద్రావిడ వాస్తు శిల్పకళలకు నిధానము. కావేరీ పరిసరములందు ఆంధ్రసర్వస్వము విజృంభించినది. ఈనాటికిని కర్ణాట, ఆంధ్ర ద్రావిడ సాంస్కృతిక సమ్మిశ్రిత చాలికలు కావేరి తీరముల సుస్థిరములై నిల్చియున్నవి. పవిత్రతయందు పావన భాగీరథి గంగకును, గోదావరి గంగకును నేమాత్రము తీసిపోదు పుణ్యకావేరీగంగ. ఆ జలములు సేవించిన సంతానములేని దంపతులు సంతానవంతులగుదురట. చారిత్రకముగ బరికించిన కావేరి స్పర్శలేని దాక్షిణాత్య చరిత్రమే లేదు. పంటలకేగాదు, అపారమైన విద్యుచ్ఛక్తి వ్యుత్పత్తికి సాధకమగుచున్నది కావేరీ. కావేరీ ఆసాంతము వుభయతీరముల పుణ్యతీర్థములే, పరమపావన క్షేత్రములే రూపొందిన భారతీయ సంస్కృతీకేంద్రములై యున్నవి.

నైసర్గికముగ కావేరి కొడగు రాజ్యమున మెర్కరా పట్టణమునకు కొంతదూరమున దక్షిణముననున్న పర్వతపంక్తి యొక్క నొక వున్నతప్రదేశమున నొకకుండ ముండిన తావున జన్మించుచున్నది. ఆ ప్రదేశమే సహ్యాద్రి కనుమలందలి బ్రహ్మగిరి పర్వతము సమీపమందే తలకావేరి గలదు; అటకు కొంతదూరమందు కవేరమహర్షి యాశ్రమము గలదు. కావేరి చాలవరకు నైరుతి దెసకు బ్రవహించుచు కొండల మధ్యనుండి అగాధమున బోవుచు కూర్గు రాజ్యమును దాటి మైసూరు రాజ్యమును బ్రవేశించుచున్నది. అటనుండి 60' నుండి 80' జలపాతముతో నొక సన్నని లోయద్వారా చుంచన్ కట్టె జలగుండముల దాటి పిదప ప్రవాహము 300 నుండి 400 గజముల వరకు విస్తృతమగుచున్నది.

కొండలలో నొకచో నది భూమియందింకినట్లయి కతిపయదూరముననున్న భగమంద క్షేత్రమున దల జూపుచున్నది. ఇచటకు కొంతదూరమున వుభయ పార్శ్వములనుండియు రెండు చిన్ననదులు కావేరిలో సంగమించుచున్నవి. ఇందు వుత్తరమునుండి వచ్చు నది యధికమైన జలముల దెచ్చుచున్నది. ఇచటకు 20 మైళ్ల దూరమున కావేరి రెండు శాఖలుగ జీలి వాని నడుమ శ్రీరంగపట్టణద్వీపము నేర్పర్చి, మరల రెండు పాయలును గలియుచున్నవి. ఇట్టి ఫలితము కల్గుటకై కావేరి పశ్చిమ వాహినిగ బ్రవహించుచున్నది. అటనుండి కావేరి మిక్కుటముగ మెలికలు తిరుగుచు నేబది మైళ్ళ దూరముననున్న శివసముద్రమును సమీపించి మరల రెండు శాఖలుగ జీలి జలపాతములుగ నేర్పడి తిరుగగలసి ముందునకు ఆగ్నేయ దెసకు బ్రవహించుచున్నది; కొంతవడి బోయి హోజనకాల్ జలపాతముల యుదకముల గల్పుకొని నైరుతి యభిముఖమై కొంత దూరమేగి తిరుగ ఆగ్నేయమునకు తిరిగి బోవుచు నొక చిన్న జలప్రవాహముం జేర్చుకొని దక్షిణాభిముఖమై మెట్టూరు కడకు జేరును. అటనుండి దక్షిణముగ బోయి భవాని గ్రామసమీపమందు భవానీ నదిని గల్పుకొనుచున్నది. ఇది ఈరోడ్ పట్టణ పరిసరము. ఇటనుండి అగ్నేయముగ బ్రవహించుచు కావేరి నోవారను నదిని సంగమింప జేసికొని పూర్వవాహినిగ కొంతదూరము బోయి వేరొక చిన్ననదిని గల్పుకొని, తిరుగ ఆగ్నేయమునకు దిరుగుచు దక్షిణ పార్శ్వమున అమరావతీ నదిని, వామపార్శ్వమున మరొక చిన్ననదిని జేర్చుకొని బలపడి పూర్వవాహినియై తిరుచునాపల్లిని సమీపించుచున్నది.

తిరుచునాపల్లిని దాటి కావేరి తూర్పునకు రెండుగ చీలి సుప్రసిద్ధ శ్రీరంగ ద్వీపమును యేర్పర్చి దాని కావల తిరుగ కలిసికొనునటుల నటించుచు మూడు పాయలుగ జీలి మధ్యమధ్య డెల్టాల నేర్పర్చుకున్నది. వీనిలో వుత్తరపు శాఖానది మిక్కిలి విస్తృతమైనది.

దానికి గొల్లడమని పేరు; అదియే coleroon. ఇది యీశాన్యముగ బోవుచు పుదుచ్చేరి, గూడలూరు పురములకు దక్షిణముగ కారైక్కాలు పురమున కుత్తరముగ కొంత దూరమున బంగాళాఖాతమున బడుచున్నది. కావేరి రెండవ శాఖ మరల రెండు పాయలుగ జీలి పూర్వవాహినులై బంగాళాఖాతమందే గలియుచున్నవి. వానిలో దక్షిణపు శాఖ కారైక్కాలు కడనే సాగర సంగమ మొనర్చు చున్నది. కావేరి మూడవ శాఖ తూర్పుగ ప్రవహింపుచు తంజావూరు ప్రక్కంబడి బోవుచు కొంత వరకు ఆగ్నేయమునకు కొంతపడి బోయి మరల రెండు శాఖలగుచున్నది. అందు వుత్తరపు శాఖ ఆగ్నేయదిశకు ప్రవహింపుచు ట్రాంక్విబారు రేవునకు కొంత దక్షిణమున బంగాళాఖాతమున గలియుచున్నది. దక్షిణపుపాయ కేవలము దక్షిణాముఖయై ప్రవహించి బంగాళాఖాతమునే జేరుచున్నది.

కావేరి నిడివి 475 మైళ్ళు మాత్రమే. ఇందు గూర్చిన పురాణకధనము తులాకావేరీ మాహాత్మ్యమునందు గలదు. కవేర ఋషికి యొక చక్కని కుమార్తె యుండెనట. ఆమె పేరు కావేరి; ఆమె బ్రహ్మగిరి శిఖరమున తపమాచరించి పరమేశ్వరుని మెప్పించెను. తండ్రికి సపర్యల జేయుచుండ నొకనాడు అగస్త్యుడరుదెంచి కామించి పరిణయమాడ గోరెనట. అంత కవేర మహాఋషి యియ్యకొని అగస్త్యుడు తన యాశ్రమమందే నుండు నిర్ణయమున కావేరీకన్యనిచ్చి వివాహ మొనర్చెను. అగస్త్యుడు కావేరీతో గార్హస్థ్య సుఖముల ననుభవించు చుండెను. ఒకనాడు వారికి ఋణవిముక్తి సమీపించెనోయన్నట్లు అగస్త్యుడు విధిని మరచి స్నానమునకై దూర ప్రదేశమున కేగెను. ఇంతలో కవేరుడు ఐక్యావస్థ బొందెను. కావేరి తన తపోఫలితమున నొకనదికాగోరి భూమినుండి జలధారగ జన్మించి ప్రవహించు చుండెనట. అగస్త్యుడు దిరిగివచ్చి దుఃఖితుడై "గతమిటుజరిగె, నీవికముందరుగదగిన మార్గముల దెల్పువాడ" నని కొన్ని క్షేత్రముల బేర్కొనెనట. అగస్త్యుడు దారిదీయుచు ముందునడువ కావేరీ వెనువెంట మందగమనయై బోవు చుండెనట. ఇది కావేరీ జన్మగాథ. పర్వత సానువులలో కేవల నిర్జనప్రదేశమున నొకచో కావేరి మృగ్యమై భగమండ క్షేత్రమున దలజూపుటను గురించి యీ క్రింది కథనము గలదు ఆ నిర్మానుష్య ప్రదేశమున నగస్త్యుడు నదీలతామను నాలింగన మొనర్ప సమకట్టినందున నా జలప్రవాహము భూగతమై నదృశ్యమయ్యెననియు, అంతనతడు భగమండ క్షేత్రమున నాఋషి పశ్చాత్తప్తుడై కావేరిని ప్రార్థింప నామె వుద్భవించి వెంటపోయెనట.

కావేరీ ప్రధానమైన వైష్ణవ క్షేత్రముల నొరసికొనుచు ప్రవహించుచున్నది; గాన రామానుజీయవైష్ణవ మతస్థులు,

"కావేరి విరజాత్తోయం, వైకుంఠరంగమందిరం!
పరవాసుదేవో రంగేశో ప్రత్యక్షంపరమంపదం"

అందురు. కావేరీ జలములు వైకుంఠము నందున్న విరజానదీజలముల నుండియే వచ్చినవని బల్కుచుందురు. కావేరి యందలి శ్రీరంగ క్షేత్రములు మూడు ద్వీపములే. శ్రీ రంగము లేక రంగము అనగా స్థలమని యర్థము. ఈ రంగత్రయము వైష్ణవ క్షేత్రములే దైవతము రంగనాథస్వామియే, వీనిలో మొదటిది. మైసూరు ప్రాంతపు శ్రీరంగపట్నము. ఇదియే ఆది రంగము. ఇది చరిత్ర ప్రసిద్ధిగల్గి యున్నది. ఈద్వీపము పొడవు 3½ మైళ్ళు వెడల్పు 1½ మైళ్ళు, వైశాల్యము 7 చదరపు మైళ్లు గల్గియున్నది. ఇందు వాయవ్య మూలను వూరిని జుట్టుకొని దుర్గము గలదు. దీనిని విజయనగర సామ్రాజ్య కాలముక్రీశ 1454 సం 11 లో వైష్ణవ తిమ్మణ్ణ అప్పటికి శిథిలమైయున్న దుర్గమును పునరుద్ధరించెను. ఇందులకై తిమ్మణ్ణాచార్యుడుకలాసవాడి జైనగ్రామమందలి 101 జైనదేవాలయములను బడగొట్టించి ఆశిలల నీపనులకుపయోగించెనందురు. అంతటి నుండి అనేకుల నివాసమునకు తావలమై శ్రీరంగ పట్టణమను పేరుగల్గెను. విజయనగర సామ్రాజ్యమున కన్నడ రాజ్యమునకు రాజధాని శ్రీరంగపట్నము.

శ్రీమతి వారణాసి యశోదాదేవి

రెండవ రంగము తిరుచినాపల్లి సమీపమందలి శ్రీరంగము. దీనిని మధ్యరంగమందురు. ఇట శ్రీరంగనాధుని ఆలయ ప్రాకారములందే శ్రీరంగ (పట్నము) గలదు ఇటీవల పైకి కూడ పెరిగినది. ఇందలి సప్త ప్రాకారములలో వెలుపలి మూడు ప్రాకారములందు పట్నమును, లోని మూడు ప్రాకారములందు దేవాలయము, తత్సంబంధమైన మంటపములు గలవు. ఇచటి సహస్ర స్తంభ మంటపము సుప్రసిద్ధము ఈ క్షేత్రము విష్ణుదేవుని భూలోక నివాసమనియు, పరమేశ్వరుండగు విష్ణుదేవుడిట శయన సుఖలీలలు ప్రదర్శించుననియు వైష్ణవ గ్రంథములు వక్కాణించు చున్నవి. శ్రీవైష్ణవులిది ప్రత్యక్ష పరమపదమందురు. ఇచట శ్రీ వైకుంఠద్వారము వాసిగాంచినది. క్రీస్తు పూర్వమునుండియు నాలయముండెనట గాని శాసనములు 9 వ శ॥నుండి గానవచ్చుచున్నవి.

ఇక మూడవ రంగము అంత్యరంగము. ఇది తంజావూరు జిల్లాలో మాయవరపట్నమునకు కొంత దూరమున కావేరి మధ్య ద్వీపమునందున్న తిరువేషుందూరు. ఇచట రంగనాయకస్వామి వెలసియున్నాడు

శ్రీరంగ పట్నమునకు ఆవల కావేరి పశ్చిమ వాహిని యగు స్థానము గొప్పస్నాన తీర్థము. ఇటనొక పురాతన వంతెన క్రిందుగ బోవుచున్నది కావేరి నది. మరల నది రెండుపాయలు జేరుకొనిన తావున సంగమేశ్వర శివలింగముకడ స్నానతీర్థము గలదు. భవానీనది కావేరిలో కలియు స్థానమున అమృతలింగేశ్వర శివలింగము గలదు ఇది పుణ్యస్నాన తీర్థమైన శివక్షేత్రము.

త్యాగరాజస్వామి జన్మస్థానమైన తిరువాయూరు పంచనద క్షేత్రము కావేరి తీరస్థమే. గంగ నీటిని- అనగా ఆర్యప్రవంతిని గోదావరిలో – అనగా ఆంధ్ర ప్రవంతిలో గల్పినట్లు ఆర్యఆంధ్ర తీర్థములను దక్షిణ దేశములో ప్రవహింపజేసిరి. త్యాగరాజు కాలములో ఆంధ్ర సంస్కృతి తిరువాయూరి కావేరిలో సమ్మిళితమై పంచనద క్షేత్రమైనది. కర్ణాటక సంగీత మూల విరాట్టువైన శ్రీ త్యాగరాజు "జూతాము రారె, సుదతులార రంగపతిని "అన్నకీర్తన యందును, "రాజువెడలె జూతాము రారే కస్తూరరంగ, కావేరి తీరమునను పావనమగు రంగపురిని శ్రీ వెలయు" అనుకృతి యందును శ్రీరంగనాధుని పాడియున్నాడు

చారిత్రకముగ కావేరి ప్రశంస పురాతనమైనది. చోళకరికాళరాజు త్రినయనపల్లవుడు తదితర సామంత ప్రభువుల సహాయముతో కావేరినదికి కట్టలగట్టించెనట. ఇది తెల్గు చోళరాజుల ప్రశస్తినుండి తెలియుచున్నది. అదియే తిరుచనాపల్లి కడ్డ కావేరి కడ్డముగ నిర్మింపబడిన ఆనకట్ట. ఇది 1000' పొడవుగల్గి బలిష్టమై యున్నది దీనినే Grand Anicut అందురు కరికాలుడు కావేరిముఖద్వారమున నిర్మించిన పట్టణమున దైవతమును శాతవాహన మహారాజు బూజించెనట గంగా కావేరీ పర్యంత ధరిత్రిపతియనియు, గంగా కావేరీ పర్యంత సప్తమ విష్ణువర్ధనులైన యనియు బిరుదులు చాళుక్య చోళచక్రవర్తి కుళోత్తుంగ దేవుని ప్రశస్తిలో గలవు 13 వ శ॥లో యాదవులకు హోయసలులకు జరిగిన యుద్ధములలో జయసూచకముగ కావేరీ తీరమున విజయ స్తంభమును యాదవ సింగదేవుని దక్షిణదేశపు రాజప్రతినిధి బాచన గట్టించెను. క్రీ. శ. 1133 సం॥కు పూర్వము శివసముద్రమును బాలింపుచున్న గంగవంశపు రాజు శ్రీరంగపట్నపు కోట కట్టించెనను వాడుక గలదు. బల్లాల విష్ణువర్ధనుడు జైనమతమును వీడి వైష్ణవుడై తన గురువు రమణాచార్యులకు 8 గ్రామములు అగ్రహారములుగ నిచ్చెనట. నేటికినవి అష్టగ్రామము లనబడుచున్నవి. హోయసల రాజ్యమంతయు విజయనగర రాయల వశమయ్యెను గదా! విజయనగర సామ్రాజ్యము అస్తమించు వరకును తిరుమలరాయలు శ్రీరంగ పట్నమున రాజప్రతినిధిగ నుండెను అతడనేక భవనములు, దుర్గము నిర్మించెను క్రీ. శ. 1564 సం॥లో తురకలు ప్రబలినను శ్రీరంగపట్నము సురక్షితమై యుండెను మైసూరు ప్రభువు కోటపై నాశగల్గియు గత్యంతరములేక మిన్నకుండెనట క్రీ. శ. 1611 సం॥లో పరిస్థితుల నరసి తిరుమలరాజు దుర్గమును మైసూరు రాజునకు నప్పగించెను అంతటినుండి రాజ వొడయిరు శ్రీరంగపట్నమందే నివసింపసాగెను క్రీ శ 1799 సం॥ వరకు మైసూరు రాజకుటుంబమచటనే యుండెను. క్రీ శ 1761 సం॥లో దుర్గము హైదరాలీ వశమై, అతని మృతితో 1781 సం॥లో టిప్పు వశమై 1799 సం॥లో టిప్పుసుల్తాను ఆంగ్ల సైనికులచే హతుడుకాగా, కొంతకాలము ఆంగ్ల సైనికస్థానమైయుండి మరల శ్రీరంగపట్నము మైసూరు వొడయరుల పరమయ్యెను. ఈనాడు

బెంగుళూరు నుండి మైసూరునకు బోవు యినుపదారి శ్రీరంగపట్నము గుండా బోవుచుండును. కాబట్టి తెరచిన గృహమువలె నున్నదీ దుర్గము. శ్రీరంగపట్నములో నేడు గానదగు దృశ్యములు – స్కెల్లీ స్తంభము, మైసూరు దర్వాజా, యేనుగుల దర్వాజా, టిప్పుసుల్తాను భవనపు శిధిలములు, రంగనాథాలయము, కదలునట్టి వంతెనయు గలవు. ఈ వంతెనను కాప్టెను డిహావిల్లాం అను ఫ్రెంచి యింజనీరు నిర్మించెను 112' వుల్లోపుగల యిటుకలాదు, 4' మందము, 4' వెడల్పు గల్గియున్నది. లాదు భూమట్టమునుండి గట్టబడి మధ్యమునకు 10' యెత్తుగల్గి యున్నది. ఇటునటు స్తంభపు దిక్కులు గలవు లాదుపైన నధిరోహించి ఖండీరాయి కడ మధ్యగ నిలబడి వూపిన లాదు యించుక కదలును. దుర్గము సమీపమున నేటియొద్దున యుద్ధస్మారక చిహ్నము, టిప్పుసుల్తాను కారాగారము, నిర్యాణస్థలము, పెద్దమసీదు. వెల్లస్లీ వంతెన, దర్యాదౌలతు బాగు, లాల్బాగు, గుంబజ – హైదరు, టిప్పుసుల్తానుల సమాధులు, కోలు బజారు, Col. Scott బంగళా, యివి గలవు.

భగమంద క్షేత్రమునకీవల కావేరిలో రెండునదులు గలియుచోటున, మూడునదుల గల్పియే కృష్ణరాజసాగరమను గొప్పసరస్సును, అందు కన్నంబాడి డాము కట్టడమును యిటీవల నిర్మింప బడియెను. ఇది మైసూరు ప్రభుత్వముచే నిర్మింపబడిన బ్రహ్మాండమైన రిజర్వాయరు (జలనిలయము) దీనికి వుత్తరపు నదియొక్కువ జలముల దెచ్చు చున్నది.

మేట్టూరు డాము సేలము మండలములో సుప్రసిద్ధ నవీన నిర్మాణమైన జలనిలయము. ఇది బ్రిటిషు సామ్రాజ్యమంతటిలోను పెద్దది, అంతేకాక ప్రపంచమంతటిలోను రెండవది. నిర్మాణమునకు ఆరుసంవత్సములు బట్టెను; 680 లక్షల రూప్యములు వ్యయమయ్యేను. డాముగోడ పొడవు 1 మైలు, జలనిలయము లోతు 214' ఇందు 93500 ఘనవుటడుగుల నీరు నిలువ యగుచున్నది. దానికి నీటిని సరాఫరా జేయు మార్గమును bridle of the river అందురు. ప్రథమమున రిజర్వాయరుగ బ్రారంభింప బడినను, అటు పిమ్మట దేశమును, పంటలను కావేరీ ముంపులనుండి రక్షించుటకు వుపయోగపడుచున్నది. క్రీ శ. 1924 జులైలో కావేరీ ప్రవాహము యధికనష్టము గల్గించెను. 800 గా తక్కువ యందు cusecs గా నుండిన జలములు 456000 cusecs గా పొంగి యధిక నష్టదాయకమై భయంకరముగ బరిణమించెను. క్రీ. శ. 1925 లో కావేరి రిజర్వాయరు ప్రాజక్టు నిర్ణితమయ్యేను. ఇందులో మెట్టూరు డాముతో పాటు 88 మైళ్లు నిడివిగల కాలువ యేర్పడవలసియుండెను.

మెట్టూరు డామునందు జూడదగిన విచిత్రమొందు గలదు దాని గోడల గుండా 8½' యడ్డు కొలత గల నాల్గు పెద్దగొట్టములు యమర్పబడినవి వీనిని Hydro Electric Pipes అందురు. వీటిద్వారా నీరు బ్రవహించుచు యీవల కరుగునంతలో విద్యుచ్ఛక్తి జనించునటుల లోని యంత్రపరికర మమర్పబడియుండుట విచిత్రము. ఆ విద్యుచ్ఛక్తి బహుదూరము గొంపోవబడుచున్నది. కాంచీపురమందలి దీపకళికలు నీ విద్యుచ్ఛక్తి నుండియే నందురు. ఇటీవల మెట్టూరు నుండి శివసముద్రమునకు ట్రాంబాట వేయబడనట. ఈ విద్యుచ్ఛక్తిని బట్టియే ఇంజనీయర్లు యీ మెట్టూరు డాము విద్యుత్సంస్థను పైకారాకంటె నుత్కృష్టతమమని శ్లాఘించియున్నారు, దీనిని "Marvel of modern engineering skill" అందురు. మెట్టూరు గ్రామము, డాము నిర్మాణమునకు బూర్వము జ్వరపూరితమై 200 జనాభాగల కుగ్రామమై యుండెను. ఇప్పటి మెట్టూరునందు వుద్యోగులు, కూలీలు నివసించుచున్నారు; బజారు యేర్పడినది, ఆరోగ్యవంతమైన పట్నమైయున్నది ఇచట జలములు గొప్ప ధ్వని జేయుచు చెవులు గింగురుమనునట్లు జేయుచుండును

కావేరీ పరిసరముల ముఖ్యమైన ప్రదేశములు మెర్కరా, బ్రహ్మగిరి పర్వతపంక్తి, కన్నంబాడి డాము, శ్రీరంగపట్నము, మైసూరు, శివసముద్రము, మొగినేకాల్ జలపాతము రిజర్వాయరు, మెట్టూరు, డామ్ మెట్టూరు, సేలము, భవాని, వుదకమండలము, యీరోడ్డు, కోయంబత్తూరు, తిరుచినాపల్లి, శ్రీరంగము, కారికాల్, గూడలూరు, పుదుచ్చేరి, నాగపట్నము, ట్రాంక్విబారునై యున్నవి. వీనిలో శ్రీరంగపట్నము నేడు పల్లెగ్రామమై యున్నది. ఆంగ్లేయుల ఆక్రమణకాలము వరకు దక్షిణదేశపు దుర్గములన్నిటిలో మేటియైన నిచటి దుర్గము నేడు గోడలచటనచట శిధిలములై, కందకములు మేటవేయుచు వృక్షజాలములు, డొంకలు బలిసి మన్యపు జ్వరములకు తావలమైయున్నది.

శివసముద్రము ప్రసిద్ధ జలపాతమునుండి విద్యుచ్ఛక్తి వుత్పత్తిజేయబడి అచ్చటికి 100 మైళ్ల దూరమందున్న కోలారు బంగారు గనులకు సరఫరా జేయబడుచున్నది భారతదేశమందలి యిట్టి పథకములలోనిది ప్రప్రథమమైనది, దీనిని నిర్వహించుటకు ప్రపంచములో నంతటికి దీర్ఘమైన, మిక్కుటమైన, బలప్రదమైన విద్యుచ్ఛక్తి transmisson lines వేయబడెను. శివసముద్రము eletric power plant నుండియే మైసూరునకు, బెంగుళూరునకు విద్యుచ్ఛక్తి సరఫరా యగుచున్నది

కావేరికి ముఖ్యమైన వుపనదులు కబ్బని, హేమవతి, అర్కవతియై యున్నవి కావేరి యొక శాఖాతీరమున చోళచక్రవర్తుల రాజధానిగను, తదుపరి విజయనగర సామ్రాట్టుల సామంతులైన నాయకరాజుల రాజధానిగను చరిత్రఖ్యాతి గాంచిన తంజావూరుగలదు, ఈ ప్రాంతముల భూమి ఫలవంతమై సస్యశ్యామలమై యున్నది. తంజావూరు నందలి బృహదీశ్వరాలయము చోళచక్రవర్తి రాజరాజు 1 చే నిర్మింప బడెను, కావున రాజరాజేశ్వరాలయమున బరగుచుండెను. దీని గోపురము దక్షిణదేశమునందలి దేవాలయములందలి గోపురము లన్నిటికంటెను వున్నతమైనది ఇచట మహోన్నతమైన నంది విగ్రహముగలదు. దీన్ని బట్టియే 19 వ శ॥ న మేజర్ H. A. Newell తంజావూరును "City of Mammoth Bull" అన్నాడు. ఇచట సరస్వతీ మహాలు పుస్తక భాండాగారమున దేశీయ విజ్ఞానముపై 20,000 వ్రాతప్రతులు గలవు. ఇన్ని వ్రాతగ్రంథములు గల బ్రహ్మాండమైన భాండాగారము ప్రపంచమున మరెచ్చటను గానరాదు. దక్షిణదేశమున నాయకరాజుల, మహారాష్ట్ర ప్రభువుల పరిపాలనా ఫలిత మీ భాండాగారము, స్మృతిచిహ్నముగ నిల్చియున్నది.

నాయకరాజుల పరిపాలన గూర్చి కొన్ని యంశముల గమనింతము వీరి పాలన షుమారు రెండు శతాబ్దములు సాగెను. (క్రీ. శ. 1500-1700). వీరి మూలపురుషుడు చెవ్వప్ప నాయకుడు అచ్యుతదేవరాయల పడ్డకుడు; రాయలచే క్రీ.శ. 1535 సం॥లో తంజాపురమున రాజప్రతినిధిగ నియమింపబడెను. ఈ నాయకరాజులు విజయనగరమందలి ముఖ్య అంశములను - పరమత సహనము, కళాపోషణ - వీనిని తమ రాజ్యమున వృద్ధిజేసిరి. నాయకరాజులలో మూడవ రాజు రఘునాథ దేవరాయలు విజయనగర రామ దేవరాయల పక్షమున కావేరిపై తోపూరుయొద్ద శత్రువుల గెల్చెను. సంగీతమందును, సాహిత్యమందును ప్రవీణుడైన నీ రఘునాథరాయలు నూతనమైన వీణావాద్యమును, జయంతసేన రాగమును, రామానంద తాళమును సృష్టించెను.

శ్రీరంగము మీదుగ కావేరి రెండుగ చీలుతావున లక్షాతోపు యుండెను, ఇది రెండు పాయలలోనికి నీరు సమముగ బ్రవహించుటకు సాయపడుచుండెను. చంబాసాహెబుతో పోరాటములలో నా తోపు నిర్మూలింపబడియెను. శ్రీరంగమును దాటిన పిమ్మట వుత్తరశాఖ దక్షిణశాఖ కంటె 20' పల్లమున పోవుచున్నది. దక్షిణపు శాఖ తంజావూరు భూములకు నీరు సరఫరా జేయుచున్నది. ఒకానొకప్పుడు వరదలవల్ల రెండు కావేరులు కలిసిపోగా పంటలకు వీలుకొరకై నీరు యెత్తున బ్రవహించుటకై కట్టలు గట్టబడెను. ఈ ప్రాంతము కర్ణాటక నవాబు మహమ్మదాలీ పాలన క్రింద యుండెను. ప్రతియేటా ప్రవాహసమయమున వేలకొలది కర్షకులు గడ్డపాములతోను, మట్టితట్టలతోను రాత్రింబవళ్లు కాచియుండువారట,

తంజావూరు రాజుల యిడుమల పెట్టుటకు కర్ణాటక నవాబుకు యిచటి కావేరి సహాయకారిగ నుండెను, నీరును తంజావూరుకు బోకుండ మళ్ళించిన వొక్కమ్మడి తంజావూరు పంటలు నాశనమగుచుండెను. సాధారణముగ తిరుచునాపల్లి రాష్ట్రములో మల్లోరు యొద్ద కావేరికి కట్టగట్టి తంజావూరు ప్రభువు పంటలకు నీరు సరఫరా జేయుచుండెను. క్రీ శ. 1763 మహారాష్ట్ర ప్రతాపసింగు యీ పనిని పూర్తిజేయక ముందు నవాబు విఘ్నము జేసెను. ఇంతలో వరదలవల్ల కావేరి కొలరూన్‌లో కలిసిపోయెను. తంజావూరు తులజాజీ మహారాజు కాలమున నీ కట్టడము పూర్తిజేయబడెను. ఎన్నోరీతుల పునీత కావేరి తీరములు ప్రగతి గాంచినవి.

ఆంధ్ర మహిళా సభ

మైలాపూర్ - మద్రాసు

మహిళా విద్యాలయము	: హిందీ, కాశీవిశ్వవిద్యాలయపుఅడ్మిషన్, ఆంధ్రామెట్రిక్, ఇ. ఎస్. ఎల్.సి., పరీక్షలకు శిక్షణ.
పారిశ్రామిక విద్యాలయము	: కుట్టు, ఎంబ్రాయిడరీ, ఊలు అల్లికలు, నూలు వడకుట, చేనేత, అచ్చుకూర్పు, ముద్రణ, బైండింగ్ ఇత్యాది పరిశ్రమలలో గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ, బీద విద్యార్థినులకు ఉచితము.
మహిళా మందిరము	: విద్యార్థినులకు వసతి గృహము.
ఆంధ్ర మహిళ	: స్త్రీలలో విద్యా వ్యాప్తికై స్త్రీలచే నడుపబడుచున్న సచిత్ర మాస పత్రిక
నర్సింగ్ హోమ్	: స్త్రీ శిశు సంరక్షణశాల, ప్రసూతిశాల, ఉచిత వైద్యశాల, కుటుంబ నియంత్రణశాఖ, దంత వైద్యశాల—అడయారులో నిర్మించబడినవి. భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖవారి విధానాన్ని అనుసరించి, సంక్షిప్త నర్స్ ఎయిడ్—మంత్రసాని పనులలో శిక్షణ యివ్వబడుచున్నది. ఫామిలీ ప్లానింగు వర్కర్సుకు శిక్షణ కూడ యివ్వబడుచున్నది.
ఆర్థోపీడిక్ సెంటర్	: వికలాంగులగు బాలబాలికలకు సంరక్షణ, విద్య యిచ్చే సంక్షేమకేంద్రం.
ముద్రణాలయము	: విద్యార్థినులకు అచ్చుకూర్పు, బైండింగ్, ప్రూపురీడింగు, మొదలైనవి ఉచితంగా నేర్పబడును. ప్రింటింగు జాబ్ వర్క్సు చేయబడును.
నాగేశ్వర శిశువిహార్	: పిల్లల విద్యావినోద కేంద్రం ప్రాథమిక పాఠశాల నడుపబడుచున్నది.
వనితా బాలవిహార్	. స్త్రీలకు, పిల్లలకు, పార్కు, ఆటస్థలం

ఆంధ్ర మహిళా సభ, హైదరాబాదు

హైదరాబాదు శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలు. (1) రీజనల్ హేండిక్రాఫ్టుస్, (2) సంక్షిప్త విద్యాప్రణాళిక, (3) చేనేత శిక్షణ- ఉత్పత్తికేంద్రము, (4) పౌర సంక్షేమ కార్యక్రమ పథకము, (5) వసతిగృహము.

హైద్రాబాద్ :

దసరా వుత్సవములు

ఆంధ్రమహిళా సభ, హైద్రాబాద్ శాఖ 25, 26, 27 తేదీలలో దసరా వుత్సవములు అమితోత్సాహముతో జరుపుకొన్నది. మా నూతన స్వగృహములో దసరా వుత్సవములు తొలిసారి జరుగుట మరియొక విశేషము. ఈ వుత్సవములో బొమ్మలకొలువూ, మా సభలో చేయబడిన చేతిపనుల వస్తుప్రదర్శన, విక్రయములు ముఖ్యాంశములు.

సువిశాలమైన మా అసెంబ్లీ హాలులో బొమ్మల కొలువు ప్రదర్శితమైనది. రామాయణ భారత, భాగవతాది పురాణేతిహాసములలోని కొన్ని ఘట్టాలు యీ కొలువునందు ప్రదర్శించాము. భారత స్వాతంత్ర్య సమరంలోని కొన్ని ముఖ్య సంఘటనలను కూడా ప్రదర్శించాము. ఇటు దైవభక్తి, అటు దేశభక్తి మిళితమై యున్న యీ ప్రదర్శన ఆ మూడు రోజులూ పలువురి మన్ననలనూ, ప్రశంసలనూ పొందినది.

ఆంధ్రమహిళా సభలో చేతిపనుల శాఖచే తయారుచేయబడిన - కళానిపుణత కలిగిన పలు రకములగు వస్తువులూ, చేనేత వస్త్రములూ పండగ మూడు రోజులూ ప్రదర్శింపబడినవి. ఈ ప్రదర్శింపబడిన చేతిపనులనీ, వస్త్రములను పలువురు తిలకించి, ఖరీదు చేశారు. ఆంధ్రమహిళా సభ హైద్రాబాద్ శాఖ సహాయకార్యదర్శిని శ్రీమతి కె. సుగుణమణి, శ్రీమతి సి. సరస్వతీ రావు యీ మూడు రోజుల కార్యక్రమాలనూ నేర్పుతో జయప్రదం గావించారు.

హైద్రాబాద్ ఆంధ్రమహిళాసభలోనిదసరా వుత్సవముల సందర్భమున అయిదుగురు జీవిత సభ్యులుగా చేరారు. మా సభ శ్రేయోభిలాషులు, ఆఫీసు సిబ్బందీ కూడా విరాళములు యిచ్చారు. ఈ విరాళములు యిచ్చినవారికి మా కృతజ్ఞత.

మాకందిన విరాళాలు

(1) శ్రీమతి సి. వి. హెచ్. రావు
(2) ,, మీనాక్షి బోబే
(3) ,, కె. ఆర్. రాజేశ్వరి
(4) ,, సావిత్రి కొండాపి
(5) శ్రీ రామాచారి

ఈ అయిదుగురూ నూరేసి రూపాయలు విరాళంగా యిచ్చి మా సభ జీవిత సభ్యులైనారు.

మా సభ శ్రేయోభిలాషుల నుంచి అందిన విరాళములు :

(1) శ్రీమతి ఎ. శ్యామలా దేవి 15 (2) శ్రీమతి జి. భారతి 10 (3) శ్రీమతి బుర్రా సుబ్రమణ్యం 10 (4) శ్రీమతి డి. మహాలక్ష్మి 10 (5) శ్రీమతి ప్రదాంబ 10 (6) శ్రీమతి ఎ. రత్నమాంబ 10 (7) శ్రీ చిమన్‌లాల్ టిపార్, 5 (8) శంభులాల్ అండ్ కంపెనీ 3/4 పళ్ల బియ్యం విరాళంగా యిచ్చారు.

మా సభ సిబ్బంది నుంచి అందిన విరాళాలు:

(1) శ్రీ జి. జి. యారె 25 (2) శ్రీమతి జి. తిమ్మాబాయ్ 15 (3) శ్రీ యస్. ఎతిరామానుజయ్య 10 (4) శ్రీమతి గౌరీబాయ్‌కీర్తని 10 (5) శ్రీ కె. యల్. ధర్ 10 (6) శ్రీ సి. టి. శాస్త్రి 10 (7) శ్రీమతి యి. సుందరమ్మ 10-10 (8) శ్రీ బి. ఆర్. వర్మ 6 (9) శ్రీ వి. రంగనాథన్ 5 (10) శ్రీ టి. ప్రసాదరావు 5 (11) శ్రీ జి. రాజారత్నం 5 (12) శ్రీ సి. హెచ్. అనంతరావు 3 (13) శ్రీ యమ్. పి. నారాయణమూర్తి 3 (14) శ్రీమతి యన్. సరసకుమారి 3 (15) శ్రీమతి ఎ. విజయలక్ష్మి 3 (16) శ్రీమతి వెంకమ్మ 3 (17) శ్రీమతి కె. ఇందిరాదేవి 3 (18) శ్రీమతి ధనలక్ష్మి 3 (19) శ్రీ యమ్. రాఘవులు 2 (20) శ్రీమతి యన్. మేరీ త్రివేణీ జోసఫ్ 2 (21) శ్రీమతి కె. శారద 2 (22) శ్రీమతి కె. పి. ఆండాళ్ 2 (23) శ్రీమతి బి. సావిత్రిదేవి 2 (24) శ్రీమతి టి. సరళామూర్తి 2 (25) శ్రీమతి బి. అన్నపూర్ణ 2, (26) శ్రీమతి సత్యవతి 1 (27) శ్రీమతి డి. వసంతమ్మ 1 (28) శ్రీ టి. సాంబయ్య 1 (29) శ్రీ పి.యస్. శర్మ 1 (30) శ్రీమతి యల్. మాలతి 1.

జీవిత సభ్యులకీ, విరాళముల నొసగినవారికీ ఆంధ్రమహిళా సభ కృతజ్ఞతాభినందనములు తెలుపుకొంటున్నది.

గేయం

మన్నించు

నిలచి పిలిచింది
నీలి పువ్వొక్కటి!
చిన్ని రెక్కలువూపి
కొంచెమూగి, ఊగె!
మూగ బాసలోఏమో
గుసగుస లాడింది,
చిఱునవ్వు నవ్వింది
మెల మెల్లగా చూసి
ముసిముసి సిగ్గుతో
కువకువ లాడింది.
లేత మోముజూపి
లేని ఆశలురేపి
చూడనే చూసింది
చూపుతో నిల్పింది!
నీలి మబ్బుల క్రింద
నీలి పువ్వొక్కటి
నీడలేకనే అయ్యో!
నిల్చివున్నావా!

నారెవ్వడుబోసె?
నీరెవ్వడుబోసె?
నిత్యమల్లిని చూపి
నిన్ను చూపి నిజము
తెల్సుకోమన్నాడు
తేల్చుకోమన్నాడు
నీళ్ళు లేకనెమల్లి
మలమలమాడగా
నీరుపోయక నీవు
తళ్కుమంటావు
నీలి పువ్వుందని
తల్చుకొన్నదెవరు?
గడ్డి పువ్వని నిన్ను
గుడ్డిగా తలచెదు.
మానవుల నైజంబు
మన్నించు! మన్నించు!

శ్రీమతి యస్. కె. ఆర్. రాణి

శారదలేఖలు

సౌభాగ్యవతి కల్పలతకు,

నెచ్చెలీ.

మీ అమ్మాయి ఆరోగ్యము సరిగాలేదని నీవు వ్రాసిన విషయము నాకు చాలా విచారమును కలిగించినది. ఎన్నియో వైద్యములు చేయించినారా? మందులు, యింజెక్షనులు, టానిక్‌లు, వాడుచున్నారా? ఎన్ని చేసినను నయము కనిపించలేదా, ఈ అలోపతి వైద్యముతో యిల్లుగుల్ల ఒళ్ళుగుల్ల యగుటతప్ప ప్రయోజనము కనిపించుటలేదా? అవును ఆవైద్యమేఅంత, అలోపతి వైద్యమనిన సామాన్యమా, దానిని భరించు టకువందలు, వేలు గడించువారైనను కావలయును. వేలు లక్షలు నిలువ ఉన్నవారైనను కావలయును మనవంటి మధ్యకుటుంబముల వారికావైద్యము శక్తికి మించిన వ్యవహారమే అయినను ఏమి చేయవచ్చును వ్యాధులు ద్రవ్యమున్న వారికే రావుగదా, అందఱు దానికి లొంగవలసిన వారే, మానవునకు ఆరోగ్యమును మించిన మహాభాగ్యము, వ్యాధిని మించిన ప్రబలశత్రువు లేదుగదా ఈ శత్రువును నిర్జించుట కెంత సొమ్మైనను కొల్లపెట్ట వలయును. మానవుల జబ్బులు రెండువిధములు ఒకటి శరీరము సని చెడుట రెండవది మనసు సరిలేకపోవుట. ఈ శరీరమో స్వాస్థ్యములకొఱకు పెద్ద పెద్ద దాక్టర్లవద్ద పెద్దపెద్ద ఆసుపత్రులలో మందులు ఇంజెక్షనులు పుచ్చుకొనిగాని నివారణ కాజాలదను భ్రాంతికి లోనగుట మరొకజబ్బు ఈ మూడు విధముల రుగ్మతలకులోనై జనులు దిగనాసిల్లి పోవుచున్నారు సంసారములు గుల్లయి పోవుచున్నది. వ్యాధి కలిమిలేములు చూచుకొని రాదుగదా, దానికి ధనిక దరిద్రతా తారతమ్యములేదు గదా ప్రతి వారిని పట్టిపల్లార్చును, ఒక్కొక్కవ్యాధి ఏళనివేళ వచ్చునో వేసిన మకాము నెత్తదు ఇక వైద్యములో వైద్యులకు లాభించినంతగా రోగికిలాభించదు డాక్టరుగారిని రోగిదర్శించినపుడెల్ల ఔషధములకు యింజెక్షనులకు చీటిలు వ్రాసి మెడికల్ షాపులకు పరుగులు తీయించుచునేయుండును కాని వ్యాధిమాత్రము కదలదు.

ఈనాడు అలోపతిలో ఐదు పదిపాతికరూకల విలువ చేయు మాత్రలు, బిళ్లలు సూదిమందులు ఉండుటచూచుచుంటిమిగదా. మనిషికి రోగమునకు మించిన ఆపత్తేమున్నది. సరే వారు చెప్పినదెల్ల కిమ్మనకుండ తెచ్చుచునే ఉందురు. కాని ఎన్నాళ్లు చూచినను ఔషధ విక్రేతలను వైద్యులను పోషించుటతప్ప వ్యాధినివారణ మాత్రము గాదు. ఒకవేళ నివారణ గలిగినను తాత్కాలికమే గాని శాశ్వతముగా తగ్గుటమాత్రము కానము. ఆ యింజెక్షనులు మానగానే ఈ వ్యాధిమరల తలెత్తుచుండును పెద్ద జబ్బులవారు విషయ మేమోగాని సామాన్య వ్యాధులకు మాత్రము ఇదిఒకవిలాసముగా పరిణమించినది. చక్కగా సూటు బూటు వేసిన మగవారు, అంతకంటె ముద్దినుసు చీరలు ధరించి. తలదువ్వుకొని పువ్వులు పెట్టుకొని రిక్షా యెక్కి ఆడవారును తండోప తండములుగా డాక్టరుల యిండ్లకును నర్సింగ్ హోములకును ఆసుపత్రులకును వెళ్లుట నిత్యము చూచుచునే యుందుము అచ్చట ఇట్టి వారే పదిమంది చేరుచుందురుగాన యిదియు వినోదకాలక్షేపముగానే యుండును అద్దెకొంపల అగచాట్లు పని వాళ్ళ పెంకితనాలు, వంటవాళ్ళ దోపిడీలు, అమ్మాయిల పెళ్ళిసంబంధాలు, అబ్బాయిల పెద్ద చదువులు, నగలు చీరెలు, ఇరుగుపొరుగు అమ్మలక్కల చర్యలు, క్రొత్తగా విడుదలైన సినిమాల మంచి చెడ్డలు, ఒకటేమిటి, అత్తగారి సాధింపు భర్తల అంటీఅంటని గృహవ్యవహారాలు అక్కడి చర్చలలో సాగుచుండును వెళ్లబోవునపుడు. రేపు మళ్లీ ఇంజక్షనుకు వస్తారుగా అని ఒకామె అంటే 'ఆఁ రాకుండా తప్పుతుందా కోర్సు అయేదాకా రోజు రమ్మన్నారుగా' అని మరియొకరి జవాబు ఈ విధముగా వారములు నెలలు సంవత్సరములు గడచిపోవును ఆ డాక్టరుల కుశల ప్రశ్నలు డాక్టరమ్మల ముచ్చట్లు నర్సుల సరసాలాపాలు మన పాలిటికి వర ప్రసాదాలు. అచ్చటి ఆ విషయములు యింటికి వచ్చినను మఱపునకు రావు. వారికి పండ్లు, పిండివంటలు, ఊరుగాయలు పంపడము అవి చాలబాగున్నవని వారు మెచ్చుకొనడము మనవారికి మధురస్మృతులే—కాని వీరిలో చాలామందికి జబ్బున్నదనుకొనుట దానికి ఇంజెక్షనులు పుచ్చుకొనుట టాబిలెట్లు, టానిక్కులు సేవించుటే ఒకజబ్బుతప్ప అంతకు మించి కానరాదు ఈ సరదారోగులకు ఇందునిమిత్తము ఇంట్లో ఎంత ద్రవ్యము హారతికర్పూర మగుచున్నదో దానిని తేలేక గృహయజమాని యెంత కుమిలి క్రుంగి పోవుచున్నాడో దైవాని కెరుక.

అందువల్లనే సంసారములు నిప్పచ్చరము చేయు వానిలో అల్లుళ్ళ కట్నములు, అబ్బాయిల చదువులతోబాటు అల్లోపతి వైద్యమునుగూడ చేర్చి చెప్పుకొనవలసి వచ్చు

మీరు చేసేపని వ్యవసాయములోనైనా, కర్మాగారములోనైనా, కార్యాలయములోనైనా—ఇదివరలో ఎన్నడూ పనిచేయనంతటి పట్టుదలతో పనిచేసి ఇదివరలోకంటె రెట్టింపు అంతకంటె ఎక్కువ ఉత్పత్తిని సాధించండి. మీరు కష్టించి పని చేసినట్లైతే దేశరక్షణ శక్తికి మరింత త[illegible]తుందనే విషయాన్ని మరచిపోకండి



ఇతోధికమైన ఉత్పత్తికీ, పటిష్ఠమైన దేశరక్షణ శక్తికీ





నిశ్చయముతో పనిచేయండి

DA 63/F 15

చున్నది. మహాత్మా గాంధిగూడ ఈ అలోపతి వైద్యము మన ప్రజలను క్రుంగదీయుచున్న వానిలో ఒకటిగా పేర్కొనియున్నారు. అయిననేమి ఇప్పుడు మనదేశమున చదువు కోర్సులకన్న మందుల కోర్సు లెక్కువైనవి. బక్కచిక్కిన దేహములు, పాలిపోయిన ముఖములు, తేలిపోవుచున్న కన్నులు పడుచు వారిలోగూడ మెండైనపుడు పట్టెడన్నము సుష్టుగాతిని పరుగుదూరము నడువగల వారరుదైనపుడు వైద్యులు, వైద్యశాలలు, వైద్యవిద్యాలయములు ఏటేట అధికమగుటలో ఆశ్చర్యమేమున్నది? ప్రతీ సంవత్సరము ప్రభుత్వమిందు నిమిత్తము లక్షలు కోట్లు వెచ్చించుచునే యున్నది. క్రొత్త వైద్య కళాశాలలు వెలయుచునే యున్నవి. వందల కొలది డాక్టరు పట్టభద్రులు వచ్చుచునే యున్నారు కొత్త ఆసుపత్రులు పెట్టుచునే ఉన్నారుగాని జన సామాన్యములో ఆరోగ్యవంతమైన ముఖములకు మాత్రము కరవుగనే యున్నది. మా అమ్మగారు "నేను 13 కాన్పుల కన్నాను. అన్నీ ఆరితేరిన కాన్పులే. ఒక గర్భస్రావముగాని, ఒక కష్టపు కాన్పుగాని యెరుగ"నని ధీమాగా చెప్పుచుండెడివారు. ఇప్పటివారిలో అట్లు చెప్పగలవారెందరున్నారు? ఈనాడు తొలిచూలు మలిచూలు వారిలోనే గర్భస్రావములకు లోనగుట, ఆయుధ సాధనములతో బిడ్డలను తీయవలసివచ్చుట సర్వసాధారణమై పోయినది గదా. ప్రౌఢ వివాహములు సాధారణమైపోయిన ఈ కాలములో ఇట్టి కాన్పులువచ్చుట అత్యాశ్చర్యము కలిగించుచున్నది. ప్రజాదరమును, ప్రభుత్వాదరమునుబడసి యలోపతి వైద్యము మహోచ్ఛస్థితి యందున్న ఈ కాలములో ఇట్టి అకాల ప్రసవములు, కష్టతరమైన ప్రసవములు, గర్భస్రావములు జరుగుటకు కారణమేమిటో తెలియదు.

మందును నోటిద్వారా మ్రింగుట అది ఆహారము వలెనే లోనికిపోయి జీర్ణప్రక్రియకు లోనై వ్యాధిని నిర్మూలించుట సహజమైన ధర్మము. మందు తిన్నామనడము ఇందువల్లనే మన కలవాటైపోయినది. ఈనాటి మందులు కడుపులోనికిపోయి జీర్ణమగుటకు మారుగా నరములలోనికి బలవంతముగా చొప్పించబడుచున్నది. ఎంత గొప్పగా జెప్పినను ఈ సూదిమందులు తాత్కాలిక నివారణలుగానే యున్నవిగాని శాశ్వత నివారణకు తోడ్పడుట లేదు. ఇంజెక్షను చావబోవు మనిషిని బ్రతికించునని చెప్పుకొనుట యెంత సత్యమో, బ్రతికియున్న మనిషి ఇంజక్షను యివ్వగానే చనిపోవుటగూడ అంత సత్యము. ఎంచిచూచినను రెండు రకముల కేసులు సరిసమానముగనే యున్నవి. ఈ ఇంజెక్షనుల నమ్మకము కోల్పోవుటకు మరికొన్ని కారణములున్నవి. ఈ ఇంజెక్షనుల వైద్యము అధికమైన తరువాత డాక్టరే యివ్వవలెనను నియమము పోయినది. కంపౌండరు, నర్సు, మంత్రసాని, వార్డుబాయి అందరు ఇంజెక్షనులు ఇచ్చువారే. అదిసరి అంతటితో పోలేదు. మా యింటిపొరుగున ఒకరున్నారు. ఆ యింటి ఆమెకు అప్పుడప్పుడు గుండె బిగపట్టుట వగైరాలు వచ్చుచుండును. ఆ ఫిట్టు రానున్నదనగనే ఆమె ఆఫీసులో ఉన్న భర్తకు కబురుచేయును. ఆయన వెంటనేవచ్చి ఒక్క ఇంజెక్షను పొడిచిపోవును. మరి ఆయన వైద్యుడు కాడు. ఇంతేకాదు మావాడొకడున్నాడు. వానికి కడుపులో వల్లమాలిన బాధ. గుంటూరు, విశాఖపట్నము ఆసుపత్రులలో చికిత్స పొందినను ఆ వ్యాధి నివారణకాలేదు. ఇక దానికి ఉపశాంతి మార్గము ఆ బాధ తెలియకుండ ఇంజెక్షను అనుదినము పుచ్చుకొనుటే. ప్రతినిత్యము ఆఫీసుకి వెళ్ళి ఉద్యోగము చేయవలసినవాడు ఏ ఆసుపత్రులవద్ద పడిగాపులు పడిఉండగలడు? కనుక తనకుతానె ఇంజెక్షను పుచ్చుకొనుట అభ్యాసము చేసికొనినాడు.

ఏమయినను శస్త్రచికిత్సలో అలోపతిని మిన్నగా చెప్పుకొనవచ్చునుగాని ఔషధ విషయమున మాత్రము గాదు అలోపతి వైద్యమునందు మందు తినుట యనునది యెప్పుడు లోపించినదో, వ్యాధినివారణలు గూడ అప్పుడే సన్నగిలినవి. అలోపతి వైద్యము ప్రపంచ వైద్య విధానములకెల్ల మిన్నయై ప్రభుత్వాదరమును పొంది ప్రపంచ వ్యాప్తి గౌరవమునందియుండగా నీవిట్లేల అనుచున్నావని కల్పలతా నీవు నవ్వుచున్నావు కాబోలు. నిజమే నావి చేదస్తపు మాటలుగా నీకు తోచవచ్చును కాని ప్రస్తుత వైద్యవిధానమువల్లనైన నేమి, అధిక ధరలవల్లనైననేమి నాకిది నచ్చుటలేదు. అచ్చముగ దీనికే పట్టము గట్టి, అనాదిగా మనదేశమున లక్షలాది కోట్లాది ప్రజలకు ప్రాణదానము చేయుచున్న ఆయుర్వేదమును, యూనానీ వైద్యమును చిన్న చూపుచూచుట ప్రభుత్వమునకు తగదు. అదియేగాదు విదేశీయమైనను, కొలది పైసల వెలగల మందులతో అద్భుతమైన ప్రతిఫలము చూపగల హోమియోనుగూడ నిరాదరించరాదు. ప్రజల కందుబాటుగల మందుదేనినైనను ప్రభుత్వముఆదరించుట ధర్మముగదా!

మిత్రురాలు శారద

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

పేదహృదయం

నేనో పెద్ద కథారచయిత్రి ననుకుంటూ ఉంటాను.

కళాకారుడు ఎవరినీ ద్వేషించడనీ, ఎవడి నెత్తిమీద బలవంతంగా కూర్చోడనీ, మనిషిని గుర్తించటానికీ అర్థం చేసుకోవటానికీ ప్రయత్నిస్తాడనీ అనే సూత్రం పదేపదే చెప్తూ ఉంటాను. కాని నిజం ఏమంటే నాకీ బిచ్చగత్తె అంటే అసహ్యం — పరమసహ్యం. తెల్లని స్వచ్ఛమైన, తాజా పాలగ్లాసు తాగటానికి పెదవుల దగ్గర పెట్టుకునేటప్పటికి ఈగపడినట్లుగా హాజరత్‌గంజ్ ప్రయాణం పెట్టుకున్నప్పుడల్లా దాని ప్రతిమ నా కళ్ళల్లో మెదులు తుండేది. కారే ముక్కుతో, నగ్నంగా నల్లని ఒంటితో, ఏడుస్తూండే పిల్లవాణ్ణి చంకవేసుకుని, నాలుగు మురికి డబ్బులున్న సొట్టల అల్యూమినియం గిన్నె పెద్దదొకటి చేతిలో పట్టుకుని, ఒంటిమీద ఒక చిన్నలంగా, ఒకప్పుడు ఎరుపో ఆకుపచ్చరంగో కలిగి ప్రస్తుతం నలుపురంగుకి తిరిగిన రవిక మురికితో బాగా చిరిగి జీర్ణమైపోయింది ఎవరిదో వేసుకుని, తలమీద ముసుగుతో, ముసుగుచిరుగుల్లోంచి చెవులకున్న పోగులు, మెడలో అక్కడక్కడ తెగిన పూసలపేరు, మెడమీదకి గట్టిగా వేసిన ముడి మాటమాటికి కన్పిస్తూ దర్శన మిస్తూండేది. తల జుట్టంతా ముడిలోనే ఉంటుందని భ్రమపడుతున్నారేమో! అబ్బే — చాలవరకు మట్టి, చెమటలతో అట్ట కట్టుకుని మర్రి ఊడలలాగున చిక్కుపడి చిందరవందరగా ఉండేవి. పుసికట్టిన కళ్లు, పాచిపళ్లు, మురికిఒళ్లు, దాన్ని గురించి ఇంతవరకు చెప్పినదాన్నిబట్టి దాంతో నాకేమీ సంబంధం ఉండగూడదు మరి. అది ఎంత మురికిగా ఉంటే ఎవరిదేం పోయింది? నిజానికి దాని పద్ధతులు ఏమాత్రం నాకు గిట్టేవికావు. అందుకని దాని ఉనికి అంటేనే అసహ్యం వేసేది.

పడుచుది, బలంగలది, పనిచెయ్యగలదు. మరి అడుక్కోవటం దేనికి? నా దగ్గర పనిచెయ్యమని కూడా చెప్పాను ఒకసారి. నా సలహా చులాగ్గా తోసిపారేసి నా పిసినిగొట్టుతనం బయటపడ కుండా ఇటువంటి సలహా ఇచ్చాననన్నట్లు గుడ్లుపెట్టుకు చూచింది.

అసలు గమ్మత్తు సంగతి ఉంది. ఎవళ్ళన్నా బిచ్చం వెయ్యకపోతే కాసేపు దీవించి తర్వాత తిట్టటం మొదలు పెట్టేది. దానితిట్లు ఎంత ఘరానాగా ఉంటాయంటే మనిషి చెవులు మూసుకుని, పనిమానుకుని పారిపోనన్నా పారిపోవాలి లేదా ఎంతో కొంతఇచ్చి పీడ ఒదిలించుకోనన్నా ఒదిలించుకోవాలి. ఇట్లా దానికి తరుచు లాభమే కలిగేది,

దానిముందు ఆపిటి, కుంటి, గుడ్డివాళ్ళకెవరన్నా ఏదన్నా ఇస్తే ఇచ్చేవాణ్ణి, తీసుకునేవాణ్ణి ఇద్దరినీ తిట్టిపోసేది. అడుక్కుంటూ వెంటపడినప్పుడు ఏమీ ఇవ్వకపోతే ధన్‌మని ఫుట్‌పాత్‌మీద కూర్చుని తిట్లపురాణం మొదలుపెట్టి అందరిముందు పిల్లవాడికి పాలిచ్చేది— ఒట్టి సిగ్గుమాలిన మనిషి.

అడుక్కునే ముసలిది ఒకతె చెప్పింది. దీనికి మొగుడు మొద్దులు ఎవరులేరట, గాని పిల్లలుమాత్రం పుడుతూనే ఉన్నారంట. బతికేవాళ్లు బతుకుతున్నారు చచ్చేవాళ్లు చస్తున్నారు. అందరిలోకి చిన్నవాణ్ణి వేలాడేసుకుని మిగతవాళ్ళని కొడుతూ ఉంటుంది. ఒకసారి నేనూ చూశా ఆరేడేళ్ళ పిల్లనెత్తిమీద ఆ సొట్టల గిన్నెతో బాదుతోంది. బాదుతుంటే చూచి దుకాణంవాడొకడు గదమాయించేటప్పటికి దెయ్యపు పుసికళ్ళు బయటపెట్టి చూస్తూ పారిపోయింది. సిగ్గు లేనిదేకాదు, జాలిలేని మనిషికూడాను.

సిగ్గు, జాలి లేకపోవడమే కాకుండా — డబ్బులు సరేసరి—తను పోగుచేసిన కాగితాలు, గుడ్డపీలికలు కూడ ఒదిలిపెట్టేది కాదు. పెంట పోగులమీద, చెత్తకుండీల్లోను ఏరిన గాజు ముక్కలు, కాళీఅగ్గిపెట్టెలు, సిగరెట్టు పెట్టెలు, ఆఖరికి తళుకు కాగితాల్లో ఒకముక్కకూడ పిల్లలకిచ్చేది కాదు. సందులో వీధిలో, కొట్టుదగ్గర, ఫుట్‌పాత్‌మీద ఎక్కడున్నా సరే తన మురికి మూటమాత్రం ప్రాణప్రదంగా పట్టుకు తిరిగేది. దాని ప్రాపంచిక సంపదంతా ఆ మూటలోనే ఉండేది. నయాపైసల లెక్కల్లోమాత్రం

పెద్దపెద్ద అక్కొంచెట్ల తలదన్నేది. ఒకనయాపైస ఇచ్చి నయాపైసన్నర వస్తువు లాక్కోవటంలో అందె వేసిన చెయ్యి. చాలామార్లు చూశా. మొదట తమలపాకు కొనేది; తర్వాత ఒక తునియకోసం ·బ్రతిమాలేది; మళ్ళీ పొగాకు అడిగేది. మళ్ళీ ఆకులో కాచు, సున్నం లేవేలేవనేది ఇంకా ఆపైన కాచు, సున్నం ఎక్కువైపోయాయ్ పొగాకు రుచే తెలియటంలేదనేది ఆఖరికి కిళ్ళీ కొట్టువాడు రెండు మూడు పొగాకు ముక్కలు దానిచేతిలో పడేసి గట్టిగా కేకలేస్తే పళ్లు బయటపెట్టి నెమ్మదిగా జారుకొనేది.

రెండు మూడుసార్లు రాత్రి పొద్దుపోయి ఇంటికి తిరిగివస్తూ చూశా — నిద్రపోతున్న గంపెడు పిల్లల మధ్య, ఒక దుకాణం చాటున కూర్చుని మసక వెలుతురులో కళ్ళు అర్చుతూ డబ్బులెక్క పెట్టుకుంటోంది ఇంకోసారి ప్రయాణంనుంచి తిరిగివస్తూ తెల్లవారుజామున చూశా గేరేజీ తలుపు వెనక నిద్రపోతోంది. చొట్టల అల్యూమినియం గిన్నె తలకింద పెట్టుకుంది. మూట తాడుతోచేతికి కట్టుకుంది. నిద్రపోతున్న దాన్నిచూస్తే రాత్రంతా తిరిగివచ్చిన దయ్యం అలసి పడిపోయినట్లు కన్పిస్తుంది.

అదంటే నేను కంగారు పడుతున్నానని దానికి బహుశా అంతుచిక్కింది. అందుకని నన్ను చూస్తే డబ్బున్న వాళ్ళలా కనపడే ఆడవాళ్ళని ఒదిలేసి నా వెంటపడేది—నాదగ్గరేదో కొంచెం గుంజి మహాసంబరపడేది. తప్పనిసరి అయి అప్పుతీసుకునే వాడి నిస్సహాయస్థితి ఆధారంచేసుకుని వడ్డీ పోగుచేసుకునే మోసగాళ్ళు సంతోషపడినట్లు, అందుకని మొదటే చెప్పా. అదంటే నాకు అసహ్యాం అని. ఇది మనిషైనా లేక మనిషిరూపంలో ఉన్న వేరే ఏదన్నా జీవా అని నాకప్పుడప్పుడు సందేహం కలిగేది.

దాన్ని మళ్ళీచూసి రెండు వారాలయింది. రాత్రి తొమ్మిది గంటల సమయం. చలికొంచెం ఎక్కువ అవటంవలన నగరంలో చీకటిపడే టప్పటికే నిశ్శబ్దం ఆవరిస్తోందిగానిదేశంమీద దాడిజరగటంవలన రేడియో లున్నచోట్ల జనంగుమికూడి నిశ్శబ్దంగా వార్తలు వింటున్నారు. దుకాణం ఎదుట వసారాలో, స్తంభం అనుకుని కిళ్ళీ కొట్టుపక్కన నిలబడిఉంది.—మామూలు మాదిరిగానే మూట చేతిలో పట్టుకుని, పిల్లవాణ్ణి ఎత్తుకుని ఉంది నెత్తిమీద ముసుగువేసుకుని రేడియో వైపు చూస్తోంది. పిల్లవాణ్ణి ఎత్తుకున్న ఎడమచెయ్యి అలవాటు ప్రకారం చొట్టల అల్యూమినియం గిన్నె పట్టుకుని చాపిఉంది. గిన్నెలో కొన్ని డబ్బులున్నాయి గాని అది వార్తలు ఎంత శ్రద్ధగా వింటున్నదంటే ఎవరన్నా గిన్నెలో డబ్బులు వెయ్యటానికి బదులు తీసుకున్నా దానికి తెలియకనే పోవచ్చు. రెప్పలు మూస్తూ, ఆశ్చర్యంతో నోరుతెరుచుకునుంది. ఇవ్వాళ మొట్టమొదటి సారిగా నన్నుచూచి గుర్తుపట్టినా నా వెంటపడలేదు.

కొద్దిగంటల తర్వాత మళ్ళీ చూశా దాన్ని. యుద్ధం మూలాన ప్రతివ్యక్తి వ్యాకులంగా ఉన్నాడు. ఆడవాళ్ళతో కిక్కిరిసిన సభలోకి ఎట్లాగో దూరి వచ్చిందికాని ఎటువైపు వెళ్ళాలో దానికి తెలియటం లేదు. నియమప్రకారం వెంట మూటఉంది. చేతిలో పిల్లవాడున్నాడు; అల్యూమినియం గిన్నె మాత్రం లేదు. ఆగిన్నె లేకపోవటం దాని వ్యక్తిత్వంలో ఏదో వింతలోపం గోచరించింది. సిల్కుచీరకట్టి, చేతులకి మెడలోను విదేశీనగలు వేసుకుని, ఎత్తుమడమలజోడు టకటక చప్పుడు చేసుకుంటూ, పెద్దనల్ల హాండ్ బాగ్ ఊపుతూ దానిపక్కనుంచి వెళ్ళింది ఒకావిడ. ఆవిడ భర్త సెక్రటేరియట్‌లో పెద్ద ఉద్యోగి. సంచిలో రుమాలుతీసి ముక్కుమూసుకుని "అబ్బ! కంపు. వీళ్ళిక్కడ కూడ ఒదలరు" అని అంది.

అది కళ్ళు తిప్పి ఆవిణ్ణి నోట్లోనే నాలుగు తిట్లు తిట్టింది కాని తన చోట్లోనే నుంచుంది.

అంతా స్టేజిమీదకివెళ్ళి చందాలు ఇస్తున్నారు. సిల్కుచీర కట్టుకున్న ఆవిడ పదిరూపాయలిచ్చింది. ఆవిడపేరు గట్టిగా చెప్పారు. అంతా చప్పట్లుకొట్టారు గొప్పగా సిగ్గుపడుతూ, హేండ్‌బాగ్ ఊపుతూ స్టేజీ

ఉర్దూమూలం : శ్రీమతి రజియా సజ్జాద్ జహీర్

దిగుతుంటే ఆవిడ బాగ్ ఒక మురికి మూటకి కొట్టుకుంది. రెండు మురికిచేతులు ఆ మూటని టేబిల్ కాలి దగ్గరపెట్టి అదృశ్యమైపోయాయ్. లంగా, ముసుగు కదులుతూ బయటికి వెళ్ళటం కన్పించింది.

"ఈ మూట ఎవరిది? ఇది ఏవరిచ్చారు? దయచేసి ఇచ్చినవాళ్ళపేరు చెప్పండి" స్టేజిమీద నుంచి వినపడింది. ఒక్కసారిగా సభ నిశ్శబ్దమయి పోయింది. ఒక్కమాట వినపడలేదు, ఒక్కరు చప్పట్లు కొట్టలేదు. ఆ మూట ఒక తెలియని సిపాయి కానుక; ఆ అజ్ఞాత వీరవ్యక్తి పేరు ఈనాటికీ ఎవరికీ తెలియదు.

మూట తెరిచారు. దానిలో గాజు ముక్కలు, గుండీలు, కాళీ సిగరెటుపెట్టెలు అగ్గిపెట్టెలు, వెండి పోగులు, అక్కడక్కడ తెగిపోయిన పూసలసరం, సొట్టలు పడిన అల్యూమినియం గిన్నె అన్నీ ఉన్నాయ్ ఆ గిన్నెలో మురికి మురికి రూపాయినోట్లు, కొన్ని మురికి డబ్బులు ఉన్నాయ్.

ఇవ్వాళ మొదటిసారిగా జరిగిందిలా. నా పక్కనుంచే వెళ్ళింది కాని నావెంట పడలేదు సరిగదా నావైపుకూడ చూడలేదు. నన్ను గుర్తుపట్టలేదు కూడ. అది చూడకపోవటం, గుర్తుపట్టక పోవటం మంచిదే అయింది. అది నావైపు చూడక నా మర్యాద దక్కించింది. లేకపోతే దాన్ని అసహ్యించుకునే నేను కళాకారిణి, మనుష్యులను గుర్తించి అర్థం చేసుకోగలను అనిచెప్పే నేను దానిముఖం ఎలా చూడగలను?

అనువాదం : ఎన్. వి. ఆర్. శేషగిరిరావు

ఆంధ్రా యూనివర్సిటీ:

విద్యార్థుల కేంద్రం

తగిన వసతిగృహాల సౌకర్యం లేకపోవడమే మహిళా విద్య మనదేశంలో వెనుకబడిపోవటానికి కారణం అని శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆంధ్ర యూనివర్సిటీ ఆవరణలో అక్కడి హాస్టలులలో వుండని విద్యార్థుల నిమిత్తం ఏర్పరుపబడిన కేంద్రానికి ప్రారంభోత్సవం చేస్తూ అన్నారు.

శ్రీమతి దేశ్‌ముఖ్ ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ విద్యార్థిని. ఈ యూనివర్సిటీలో ప్రవేశార్థం 1925-30 ప్రాంతంలో ఆమె ఇక్కడకు వచ్చిన సందర్భంలో జరిగిన కొన్ని సంఘటనలను ఆమె వివరించారు. హాస్టలు సౌకర్యం యీ యూనివర్సిటిలో అప్పుడు స్త్రీలకు లేనందున తనకు ప్రవేశం నిరాకరింపబడిందని ఆమె అన్నారు. అయితే స్త్రీలకు ప్రత్యేకం హాస్టలు ప్రారంభించాలని తాను అప్పటి ఉపాధ్యక్షుడు డాక్టర్ సి. ఆర్. రెడ్డికి సూచించాననీ, కనీసం ఆరుగురు విద్యార్థినులయినా వుంటేనే కాని హాస్టలు ప్రారంభింప వీలు కాదని ఆయన సమాధానం చెప్పగా, అసలు స్త్రీలకు హాస్టలనేది ప్రారంభిస్తే ఆరుగురు కంటె ఎక్కువే విద్యార్థినులు వస్తారని తాను ప్రతివచన మిచ్చానని శ్రీమతి దేశముఖ్ వక్కాణించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మూడు సంవత్సరాల ఖైదు శిక్ష తనకు విధింపబడడమే యిక్కడ తనకు హాస్టలు సౌకర్యం లేకపోవడానికి అసలు కారణం అని తాను గ్రహింపగలిగానని కూడా ఆమె వక్కాణించారు.

ఆ పిమ్మట తాను మరొక డజనుమంది విద్యార్థినులు స్వంత వసతిగృహం ప్రారంభింపగా, యూనివర్సిటీ అధికారులుచూచి వారే ప్రత్యేక హాస్టలు మహిళలకు ప్రారంభించి అందులో చేరమని తమందరను ఆహ్వానించారని అన్నారు.

యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్

యూనివర్శిటీ గ్రాంట్ల కమీషన్ యిస్తున్న ఆర్థిక సాయాన్ని మన దేశంలో చాలా యూనివర్సిటీలు ఉపయోగించుకోనడం లేదని శ్రీమతి దేశముఖ్ విమర్శించారు.

కమీషన్ తలపెట్టిన సంక్షేమ పథకాలెన్నెన్నో చాలా యూనివర్శిటీలు గుర్తింపనేలేదనీ, గుర్తించినా అమలుజరపలేదనీ దీనికి కారణం అసలు యిట్టి పథకాలున్నాయని తెలియక పోవడమో, లేదా యూనివర్శిటీ విద్యార్థులలో సాహసోత్సాహ శక్తులు లోపించడమో అవాలనీ ఆమె విమర్శించారు.

సంక్షేమ పథకాలు

యూనివర్సిటీ విద్యార్థుల ఉపయోగార్థమై కమిషన్ తలపెట్టే సంక్షేమ పథకాలలో ఆరోగ్య కేంద్రం ఒకటనీ, యాభై వేల రూపాయలు యూనివర్సిటీ గ్రాంటులకమిషన్ సాయం చేయకలదని ఆమె అభిభాషించారు. వినోద కర్మాగారాల నిమిత్తంకూడా కమిషన్ ధనసాయం చేస్తుందన్నారు. మానసిక తత్త్వ సంబంధమైన సలహా కార్యకలాపాల సందర్భాలలోనూ, ఫిలిం సంఘాల స్థాపనలోనూ, కమిషన్ సాయం లభింపకలదని కూడ శ్రీమతి దేశముఖ్ అన్నారు.

యువజన సంక్షేమం

గత రెండు ప్రణాళికలలోనూ యువ సంక్షేమార్థంచాలా ధనం ఖర్చుపెట్ట బడిందనీ కాని యీ వ్యయం ప్రత్యేకంగా విద్యార్థి యువకుల నిమిత్తమే జరిగిందనీ, విద్యార్థేతర యువకులకు యే మాత్రం యిది దక్కలేదని, దీనికి కారణం అట్టి వారలకు ప్రాతినిధ్యం లేకపోవడమే అని ఆమె అన్నారు. ఇంతే కాక పరిపాలన విషయంలో రాష్ట్రాలన్నీ ఒకవిధంగా కార్యకలాపాలు అమలు జరపడం లేదన్నారు.

విద్యావిధానంలో జరుగుతున్న ప్రయోగాలనుఆమె విమర్శించారు. కమిషన్లు, కమిటీలు చేసిన సిఫార్సులు విస్మరింపబడ్డాయని కూడ ఆమె విమర్శించారు.

'ఆలోచన శక్తులు వ్యయమయాయి, ప్రజల్లో విశ్వాసం తొలగింది, కొండంత ఆశలన్నీ చివరకు గోరంతలుగా దిగజారాయి అని ఆమె వాక్రుచ్చారు.

ఈ సభకు ఆంధ్రయూనివర్సిటీ వైస్- ఛాన్సలర్ డాక్టరు ఏ. ఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. ఈ భవనాలకు యూనివర్సిటీ పూర్వవిద్యార్థిని శ్రీమతి దేశ్‌ముఖ్ ప్రారంభోత్సవం చేయడం అత్యంత ముదావహం అని ఆయన అభిభాషించారు.

ఆంధ్రా యూనివర్సిటీ :

ప్రణాళికా వారోత్సవాలు

ఆంధ్రాయూనివర్సిటీలోని ప్రణాళికా వేదిక ఆధ్వర్యంలో ఢిల్లీ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు శ్రీ సి. డి. దేశ్‌ముఖ్ నవంబరు 11 వ తేదీ సాయంత్రం ప్రణాళికా వారోత్సవానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సమావేశానికి వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ. ఎల్. నారాయణ అధ్యక్షత వహించారు. దేశ్‌ముఖ్ దంపతులు ఢిల్లీనుంచి విమానంలో వచ్చారు.

గత 13 ఏండ్లనుంచి ప్రణాళికా కార్యకలాపాలలో విరివిగా పాల్గొని దేశం నలుమూలలా దంపతుల మిద్దరమూ పర్యటించామని, తామీ పర్యటన సందర్భంలో 350 జిల్లాలలోనూ 280 జిల్లాలు దర్శించామనీ, ఈ పర్యటనలో గ్రామీణ ప్రాంతాలను దర్శించి, ఆ యా ప్రాంతాలలోని కార్మికులతోను, గ్రామ సేవికలతోను, ప్రసంగించే అవకాశంకూడా లభించిందని అయన వచించారు.

ప్రణాళికలు అవసరంలేని దేశమనేదివుండదు అనీ, తనకున్న సమస్త ఆధారాలు పూర్తిగా వినియోగపరచినప్పుడే అన్యులు తనకిచ్చే సాయానికి తగిన సంపూర్ణ ఫలితం ఏదేశమైనా పొందగలదనీ, అయితే, ప్రణాళికలే అవసరంలేదు. సమస్తం దానంతట అదే జరుగుతుందని అనుకోవడం సరికాదనికూడ ఆయన అన్నారు. ఈ సందర్భంలో భారిగా ప్రభుత్వసహాకారం అవసరమనీ, ప్రభుత్వరంగం ప్రయివేటు రంగాలమధ్య సత్ఫలదాయకమైన సంబంధం అవసరమనీ, ఆ విధంగా సమాన సారూప్యమూ, సమ్మిశ్ర సత్సాంప్రదాయమూ, ఆ రెండింటిమధ్య ఏర్పడినప్పుడే దేశాభ్యుదయం సాధింపబడకలదనీ, శ్రీ దేశ్‌ముఖ్ వచించారు.

గ్రామీణాభివృద్ధి, పారిశ్రామిక పరివృద్ధి అనే మాటలురూపంలో రెండయినా వాటి అర్థం ఆశయం మాత్రం ఒకటే అనికూడా ఆయన వచించారు. ఆ రెండూ పరస్పరం ఆధారం వుండేవీ, సహకార యోగ్యమైనవీ అనికూడ అన్నారు.

నియంతృత్వాధికారంలో ఉంటున్న దేశాలు తొందరలోనే అక్కడక్కడ కొన్నిచోట్ల అభివృద్ధిని సాధింపకలిగినా, నేటి కమ్యూనిస్టు దేశాలలో జాతీయోత్పాదనశక్తి కమ్యూనిస్టేతర దేశాలలోవలెనే వుంటున్నదని ఆయన వక్కాణించారు. సున్నితంగా చెప్పాలనంటే మన వ్యవసాయ రంగంలో ఏమాత్రం అభివృద్ధి సాధింపబడలేదనక తప్పదని శ్రీ దేశ్‌ముఖ్ వాక్రుచ్చారు. ఆదిలో ప్రణాళికా కార్యక్రమాలను రూపొందించిన వారిలో తానుకూడా వున్నాననీ, అయితే, జనాభా యింత విపరీతంగా పెరిగిపోతుందని ఎన్నడూ తాను భావించలేదనికూడ ఆయన వక్కాణించారు.

ప్రజాస్వామ్య విధాన సాధన విషయమై, ప్రస్తావిస్తూ, అగ్రస్థానంలో సమర్థులైన వారు కొరతగా ఉన్నారనీ, ఇట్టి పరిస్థితి కొంతకాలం వుండడం సహజమేననికూడ ఆయన అభిభాషించారు.

('ఆంధ్రప్రభ' దినపత్రిక సౌజన్యంతో)



★ అమ్మ ★

గోపి, తన చేతిలోనున్న కుక్కపిల్లను ముద్దుచేస్తూ జానీ! ఇక్కడ బజ్జో అని, మంచంమీద పడుకో బెట్టి, పాలు తెస్తాను వుండు అంటూ లోనికి తుర్రుమన్నాడు.

“ఒరే గోపీ! ఎక్కడికిరా కాళ్లయినా కడుక్కోలేదు. పద! స్నానము చేద్దువుగాని” అని నాయనమ్మ మందలించింది. “ఉండు నాయనమ్మా! కుక్కపిల్లకు ఆకలేస్తుంది పాలుపోయాలని” మొహం చిట్లిస్తూ నిర్భయంగా చెంబులోనున్న పాలు వలుకపోస్తూ వంచేస్తున్నాడు. పోయినపాలను కుక్కపిల్ల నాకేస్తూ వుంది.

వాడిచేష్టలు అర్థంకాక నాయనమ్మ నిర్ఘాంతపోతూ తలపైన కొంగు సవరిస్తూ, “వెధవకానా! పాడు కుక్కపిల్లను తెచ్చావట్రా! బడి ఎగ్గొట్టేసి చేసే వాలకం ఇదేనట్రా!” అంటూ గర్జించింది.

నాయనమ్మా! కూరమాడిపోతుందని చెపుతూ కుక్కపిల్ల వద్దకు వచ్చాడు. “పిచ్చినాయనకు భూతదయ ఎక్కువ, చివరకు వాడిని ప్రేమించే తల్లి కరువైంది” అంటూ కళ్ళు తుడుచుకొన్నది నాయనమ్మ.

ఆకలితోనున్న కుక్కపిల్ల లొచలొచమని శబ్దం చేస్తూ పాలంతా త్రాగసాగినది. ఆశ్చర్యంతో చూస్తున్న గోపి గతుక్కుమంటూ “అయ్యో! జానీకి నా కళ్ళదృష్టి తగులుతుంది” అని కళ్లు పక్కకు తిప్పుకొన్నాడు. పాపము జానీ తల్లి ఎక్కడుందో ఏమో. అమ్మ ఆస్పత్రిలో నున్నట్టు అదీ ఎక్కడైనా వుంటుంది అని గొణుక్కున్నాడు అమాయకుడైన గోపి.

“ఔనురా ఈ దిక్కులేని వెధవాయిలకంతా! విధిలేక చేయాలంటూ” దభీమని గోపి వీపుపై అంటించింది సవతితల్లి మీనాక్షి. గోపి ఉలిక్కిపడి మారుతల్లి వేపు చురాచురా చూశాడు. “వెధవకానా! రోజు రోజుకు నీ అల్లర్లు ఎక్కువయ్యాయి. ఛీ పాడుకుక్కను

ఎందుకు తెచ్చావు" అని కుక్కచెవి పట్టుకొని దూరంగా విసరింది. కుక్కపిల్ల రెండు దొళ్ళుదొళ్ళి బాధతో 'కుయ్యో కుయ్యో'మని అరచినది.

"నీవు రాకాసివి" అంటూ కుక్కపిల్లను ఆప్యాయతతో వళ్ళు నిమిరాడు సవతితల్లివంక కోపంగా చూస్తూ.

ఏడేళ్ళ కుర్రకుంక తన్ను రాకాసి అని అవమానించాడన్న ఉక్రోషంతో మీనాక్షి ఉగ్రురాలై, "దిక్కులేని వెధవ! నన్ను తిడుతావట్రా" అంటూ దబదబా బాదసాగింది గోపి ఏడుస్తూ, 'కొట్టకు పిన్నీ!' ఇంకెప్పుడూ తిట్టనని బ్రతిమాలాడు. "వెధవా! అలా దారికిరా! గోముచేసి మీ నాన్న, నాయనమ్మ ఇలా తయారుచేశారు. నెత్తికెక్కి కూర్చున్నావు" అంటూ రెండు మొట్టికాయిలు మొట్టింది

గోపి ఏడ్పు విన్న నాయనమ్మ పరుగున వచ్చి "వసే ఎందుకే! వాణ్ణలా బాత్తున్నావు. తల్లిలేని ఆ వెధవను" అంటూ నాలుక కరుచుకొని "నీకేం తెలుస్తుందే కడుపుతీపి" అంటూ ఎక్కసెక్కాలాడుతూ గోపీని దగ్గరకు తీసుకుంది

"ఔను నాకేం తెలుస్తుంది. వాణ్ణి గోముచేసి నెత్తికెక్కించుకున్నారు. నేనెంతయినా! సవతి తల్లినే కదా!" అంటూ మూతులు తిప్పుతూ తన గదిలోకి వెళ్ళింది మీనాక్షి.

తన్ను ఆప్యాయంగా చూచుటకు తన నాయనమ్మ వుందని కాబోలు పినతల్లివేపు ఎగాదిగా చూస్తూ వెక్కిరిస్తూ లోనికెళ్ళాడు గోపి.

గోపి చిన్నపుడే తల్లిని పోగొట్టుకొని నిర్భాగ్యుడయ్యాడు. జానకిరామయ్య బంధువుల ప్రోద్బలం వల్లనేమి, యిష్టంవల్లనేమి మీనాక్షిని ద్వితీయ వివాహం చేసుకున్నాడు

తల్లి కనబడనందుకు గోపి, "అమ్మ ఎక్కడికి పోయింది నాన్నా!" అంటూ తండ్రిని వేధించేవాడు. వాడికి ఎలా నచ్చచెప్పాలో అర్థం కాని జానకిరామయ్య ఆవేదనతో, "మీ అమ్మ ఆస్పత్రిలో ఉంది నాన్నా" అని బుజ్జగించాడు. వాడి మనస్సు మీనాక్షిపై మరల్చ దలచి, "ఇదో! మీ చిన్నమ్మ మీ అమ్మే పంపింది బాబూ" అంటూ వాడిని మీనాక్షి చేతికి అందించబోయాడు. వాడు మీనాక్షిని చూస్తూ బూచి-బూచి అంటూ ఛీపో అని చీదరించుకొనేవాడు. మీనాక్షిని చూస్తే అసహ్యించుకొనేవాడు.

మీనాక్షి గోపిని దగ్గరకు తీసుకుని బుజ్జగించుటకు పడిన శ్రమ అంతా వృథా అయింది. మీనాక్షి సవతి కొడుకును ప్రేమించుటకు బదులు ఆమెయందు ఈర్ష్య పెనవేసుకుని వాడిని కఠినంగా చూచేది. ఇక జానకిరామయ్య భార్యాలోలుడై గోపి విషయమే పట్టించుకొనేవాడు కాదు.

ఒకరోజు గోపి ఆలస్యంగా బడికి వెళ్లాడు.

ఆలస్యంగా వచ్చిన గోపీని చూచిన మాష్టారు ఉగ్రుడై పేముబెత్తము ఝళిపించాడు. "ఎక్కడికి వెళ్లావురా? ఎందుకింత ఆలస్యం" అంటూ గర్జించాడు.

గోపి బెదిరిపోతూ, "సార్; సార్! ఒంటి ఎక్కనా!" అని మేష్టారు వేయుశిక్షలు జ్ఞప్తికి తెచ్చుకుంటూ నీళ్లు నములుతూ ప్రశ్నించాడు. వాడి అమాయకత్వానికి క్లాసులో పిల్లలంతా గొల్లుమన్నారు.

మేష్టారు ముఖం చిట్లిస్తూ పేముబెత్తము బల్లమీద కొడుతూ సైలెన్స్ అన్నాడు. గోపీని చూచి, "అదే? ఎక్కడికి వెళ్లావురా! ఇప్పుడు టైమెంతో తెలుసా!"

గోపి బెదురుతూ "తొమ్మిదండి సార్! నేను వస్తూవుంటే రెడ్‌క్రాస్ సంఘంవారు రక్షణనిధికి సాయం చేయమని అడుగుతుంటె, నా ఉంగరం ఆ డబ్బిలో పడేశానండి. నేనుకూడా వాళ్లతో కలిసి డబ్బు వసూలుచేయుటకు తిరిగానండి. అందుకే ఆలస్యం అయిందండి" కళ్ళు పెద్దవిచేస్తూ మేష్టారువేపు భయంతో చూస్తూ తలదించుకొన్నాడు.

మేష్టారి మొహం ఎఱ్ఱబడుటకు బదులు ఆనందంతో ప్రపుల్లితమైనది. గోపిని దగ్గరకు తీసుకుని వీపుమీద తడుతూ "శహబాస్ గోపీ! నీవు కుర్రవాడవైనా, పెద్దవారికి మార్గదర్శకుడవైనందుకు నిన్ను మెచ్చుకుంటున్నాను. ప్రతి ఒక్కరూ మనదేశంకొరకు త్యాగంచేయాలి. అప్పుడే మనం స్వాతంత్ర్యమును నిలబెట్టుకొన్నవారమవుతాము. బాలలూ చూశారా!

శ్రీమతి సి. కె. లక్ష్మి

మన గోపి ఎంతటి బుద్ధిమంతుడో! నేటినుండి క్లాసులో లీడరుగా పెడుతున్నాను" అని గర్వంగా పలికాడు మేష్టారు.

పిల్లలందరూ సంతోషంతో చప్పట్లుకొట్టి గోపిని చుట్టుముట్టారు. గోపి స్నేహితుడు రామం, గోపి చేతిలో ఒక లడ్డు వుంచుతూ, "ఒరే! నేడు నా పుట్టిన పండుగరా! నా కొత్తలాగు చొక్కా చూశావా! ఎంత బావుందో! మా అమ్మ కుట్టించిందిరా!" అంటూ గర్వంగా చూపాడు.

గోపి లడ్డు తింటూ, "మీ అమ్మ ఎంత మంచిదిరా! నా పుట్టినరోజు పండుగకు నేనుకూడా కుట్టించు కొంటానురా. మా అమ్మ ఆస్పత్రిలో ఎక్కడో దూరంగా ఉందట ఎప్పుడొస్తుందో ఏమో" అంటూ చమర్చిన కళ్లను తుడుచుకోసాగాడు.

అల్లంత దూరంలో ఆడుతున్న రౌడీ రంగడు గోపి వద్దకు వచ్చి "వరే? మీ అమ్మ ఎక్కడుందిరా! ఎప్పుడో చచ్చిపోయింది" అంటూ సాగదీస్తూ వెకిలిగా నవ్వాడు. గోపి కోపంతో, "ఏంరా! కూశావు?" అని లెంపకాయ కొట్టాడు. వాణ్ణి ఇంకా ఉడికించాలనే నెపంతో "మీ అమ్మ చచ్చిపోయిందిరా! ఈ బుద్ధాయికి ఇంకా తెలీదు" అన్నాడు రంగడు.

వాడి మాటలు గోపి హృదయంపై శూలాల్లా గుచ్చుకొన్నాయి. కుప్పలా కూలుతూ మా అమ్మ చచ్చిపోయిందా! అంటూ బిగ్గరగా ఏడ్చాడు.

గోపి ఏడుపు విన్న మాష్టారు పరుగున వచ్చి, "ఏమయింది గోపీ! ఎందుకు ఏడుస్తున్నా"వని ప్రశ్నించాడు.

"మా అమ్మ చచ్చిపోయిందట సార్, ఔనాండి?" అని వెక్కి వెక్కి ఏడ్చాడు. మాష్టారు కళ్ళు ధారాపాతాలయ్యాయి.

పాపము ఈ కుర్రకుంకకు తల్లి పోయినదని చెప్పక మభ్యపెట్టుట మహాపాపము అనుకుంటూ -

"గోపీ ఇలా రామ్మా! ఏడవకు, మీ అమ్మ చచ్చి రెండేళ్లయింది బాబూ! నీవు సంతోషంగా, కులాసాగా గొప్పవాడవ్వాలని మీ తల్లి స్వర్గాన్నుండి నిన్ను దీవిస్తూ వుంటుంది. పొద్దుపోయింది. ఇంటికెళ్లు బాబు" అని బుజ్జగించి పంపాడు.

గోపికి తండ్రిపై కోపం ముంచుకొచ్చింది. తనకెవరు దిక్కు? ఇన్నిరోజులు తల్లి ఉందని ఏదో కొండంత ఆశలతో, నిరీక్షిస్తున్న గోపికి పిడుగులాంటి ఆ మాటను విని, నిరాశుడైనాడు. దిక్కులేనివానిని ఎవరూ ఆదరించరనే భావన, ఆ చిట్టి హృదయంపై ఏవో ఆవేశాలు కోపాలు కలుగచేసినది.

ఆదుర్దాగా ఇల్లు చేరాడు. ఎంతో కులాసాగా ఇంటికి వచ్చే గోపి ఆనాడు ఏడుస్తూ వస్తున్నందుకు నాయనమ్మకు ఆశ్చర్యం కలిగింది. గోపి ఎక్కిళ్ళు, ఈజీ ఛైరులో కూర్చుని పేపరు చదువుతున్న జానకి రామయ్యకు వినిపించాయి, ఆశ్చర్యంతో, "ఏరా, గోపీ! ఎందుకు ఏడుస్తున్నావు?" అని ప్రశ్నించాడు.

తండ్రిని చూసిన గోపికి దుఃఖము ఆగినది కాదు. "నాన్నా, అబద్ధం చెప్పావా నాకు! అమ్మ చచ్చిపోయిందా! నాన్నా!" అని భోరున ఏడ్చాడు.

జానకిరామయ్య హృదయం ఆవేదనతో బ్రద్దలైంది. "ఔను బాబూ! నేనసత్యమాడాను. నిర్భాగ్యుణ్ణి, నీ చిన్న హృదయాన్ని గాయపరిచాను." గోపిని హృదయానికి హత్తుకొని కన్నీరు వుంచాడు తండ్రి.

"నాన్నా! అబద్ధం చెప్పకూడదని అమ్మ చెప్పింది కదా!" అని అమాయకంగా ప్రశ్నిస్తూ తన తల్లి చెప్పినమాట మననం చేసుకున్నాడు.

తండ్రి ఆవేదనతో కుమిలిపోతూ, "ఇంకెప్పుడూ అబద్ధమాడను గోపీ!" అన్నాడు సిగ్గుపడుతూ.

ఆ హృదయవిదారక ఘట్టాన్ని చూస్తున్న మీనాక్షి కండ్లు చమర్చాయి. ఆ తల్లిలేని పిల్లవానిని తానెందుకు ప్రేమించకూడదు. ఆదరణాప్యాయములతో గోపిని తనవానిగా చేసుకోవాలి, కన్నతల్లిని మరిపించాలి. ఆమె అంతర్యంలో గూడు కట్టుకొన్న అసూయాద్వేషాలు సూర్యరశ్మికి కరిగిన హిమము వలె పశ్చాత్తాపంచలైనవి.

"గోపి నీ కొడుకు! వానిని ప్రేమించు కరుడు కట్టిన నీ హృదయంపై పుత్రవాత్సల్యమనెడి మమతను చిలకరించు"మని ఏవో ఆదేశాలు ఘోషించినట్లయినవి.

ఆనందాశ్రువులతో "గోపీ!" అంటూ వానిని హృదయానికి హత్తుకొన్నది.

"మారుతల్లి వైఖరి అర్థంకాని గోపి, తల్లి ఒడి మరచినవాడు ఆమె వెచ్చని కౌగిటిలో తలదాచుకొని, "అమ్మా!" అంటూ ఏడ్చాడు.

★

తల నొప్పిగా ఉందా?

రవ్వంత **అమృతాంజనము** రాయండి

నిమిషంలో
నొప్పి తగ్గుతుంది



జలుబూ, జ్వరాలూ, ఒళ్లు నొప్పులు – వీటన్నిటికీ అమృతాంజనం ఉపయోగించండి. మీ కుటుంబాని కది శ్రీరామరక్ష. నొప్పి కలిగినప్పుడు ఒక్క పిసరు రాస్తేచాలు ఇంట్లో ఒక్క సీసా ఉంటే నెలలతరబడి ఆటిపస్తుంది.

అమృతాంజన్ లిమిటెడ్, మద్రాసు - 4
బొంబాయి - 1, కలకత్తా - 1, న్యూఢిల్లీ - 1.



JWT AM-1424 a

మాటతీరు

ఆరోజు మధ్యాహ్నం మా ప్రక్కింట్లో ఉంటున్న విమల గారింటికి వెళ్ళాను. ఇద్దరం కబుర్లలో పడ్డాం. పదినిముషాలు గడిచేసరికి మూడేళ్ళ పిల్లవాడూ, ఏడాది నిండిన పిల్లా లేచి ఆరున్నొక్క రాగం ఆలాపించసాగారు. ఆమె లేచి యిద్దరికీ బిస్కట్లిచ్చింది.

'పెద్దపిల్లలిద్దరూ కనబడరేం?' అని అడిగాను.

'ఆ వెధవలు షైర్లు వేటుకు పోయారు' అన్నది.

'అమ్మా! ఈ గుంతముండ నా బిచకత్తు లాక్కుంతూందే' అంటూ పిల్లవాడు ఫిర్యాదు చేశాడు. మాటలుకూడ సరిగా ఉచ్చరించలేని ఆ పసివాడు చెల్లెల్ని తిట్టడం వినేసరికి చాల చికాకువేసింది.

'ఈ వెధవలిద్దరూ నా మడి మండబెట్టేశారు' అంటూ విమల అత్తగారు విసురుగా పిల్లను రెక్కపుచ్చుకొని తీసుకొనివచ్చి విమల దగ్గర కూర్చోబెట్టి వెళ్ళిపోయింది. విమల యిబ్బందిగా నావైపు చూచింది. నేనిక అక్కడ ఉండలేక లేచి వచ్చేశాను.

కొంతమందికి మోటుతిట్లు, మాటలు నాలుక చివరనే ఉంటాయి. పిల్లలను, తమకు అయిష్టులు అయినవారిని 'వెధవలు' అనే సంభోధిస్తారు. పెద్దవారు మోటుగా మాట్లాడితే పిల్లలు కూడ అటువంటి మాటలుపయోగించడానికే అలవాటు పడతారు. ముఖ్యంగా పిల్లల యెదుట యెవరినీ చెడుగా దూషించకూడదు. ఇందువలన పిల్లలు యితరులను గౌరవించి, నమ్రతగా, నాజూకుగా మాట్లాడటం చేతకానివారవుతారు.

పూర్వకాలపు స్త్రీలు మోటుగా మాట్లాడినా అంత బాధించదు. మాకు తెలిసిన ఒకావిడ పిల్లలను యెప్పుడూ, 'పిండాకూడు మింగడానికి తగలబడరేం?' అంటూ పిలిచేది. ఇట్లాగే ఆవిడ నోట్లోంచి వచ్చే ప్రతిమాటా యెంతో అసహ్యంగా ఉండేది. ఎంతో మంచిమనిషే అయినా మాటతీరు తెలియకపోవడంవలన గయ్యాళిగా పేరుగాంచింది. అంతో యింతో చదువుకున్న నేటి స్త్రీలు సాధ్యమైనంతవరకు మోటు సంభాషణలకు దూరంగా ఉండాలి. నలుగురిలో మాట్లాడేటప్పుడు అశ్లీలాలు దొర్లితే ఎబ్బెట్టుగా ఉంటుంది. స్త్రీలే కాదు. కొంతమంది పురుషులు కూడ అసహ్యంగా మాట్లాడతారు. ఇట్లా మాట్లాడటం మనంతట మనం పిల్లలకు నేర్పడమే అవుతుంది. ఒకొక్క యిండ్లలో పిల్లలు ఒకరినొకరు తిట్టుకుంటారు. అది వింటే యిక వారిని దగ్గరకుతీసి మాట్లాడబుద్ధి వెయ్యదు. ఒకవేళ పిల్లలు బైట అటువంటి తిట్లు నేర్చుకొనివస్తే నయానా భయానా మాన్పించాలి.

సందర్భోచితంగా మాట్లాడడం కూడా ముఖ్యమే. జబ్బుతో యెవరైనా బాధపడుతూంటే వారివద్దకు వెళ్ళి, 'ఈ జబ్బు ప్రమాదకరమైనదే సుమండీ? మంచిమందులు తీసుకుంటే కాని లాభంలేదు' అంటూ కొందరు హడలగొడ్తారు. చేతనైతే ఫరవాలేదని అనునయించాలి.

శ్రీమతి వాణి

లేదా మరొక ప్రస్తావన తేవాలి. అంతేకాని భయపెట్టడం భావ్యంకాదు. గర్భిణీ స్త్రీలవద్ద కాన్పు స్త్రీకి పునర్జన్మ అంటూ ఆ కారణంగా పోయిన వారి గురించి ప్రస్తావిస్తే వారు మరీ బెంగపడి నీరసించిపోతారు. ఈ సంగతులు వారికి తెలిసినవే అయినా యితరులు చెప్తేమట్టుకు భయంకరంగా తోస్తాయి.

కొందరు భోజనాలు చేసేటప్పుడు వ్యాధుల గురించో, తాము ముట్టని మాంసాహారంలో యెంత బలమున్నదో చెప్పి వాటిగురించి దీర్ఘోపన్యాసాలిస్తూ ఉంటారు. ఇవి పట్టించుకోనివారైతే బాధలేదు లేకపోతే ఏవేవో అసహ్యకరమైన దృశ్యాలు కళ్ళముందు మెదిలినట్లు తోచి అన్నం సహించక లేచిపోయే పరిస్థితికి కూడ వచ్చేస్తారు. మాంసాహారం మంచిదే అయినా కొందరు శాకాహారులు భోజనసమయంలో వాటి సంగతులు మాట్లాడితే తినలేరు. అయితే నలుగురిలో కూర్చున్నప్పుడు యే రకమైన సంభాషణ వచ్చినా సహించడం ప్రతివారూ నేర్చుకోవాలి. కాని ఆ సమయంలో వీలయినంత మట్టుకు ఉల్లాసం కల్గించే కబుర్లకే తావివ్వాలి. లేకపోతే మౌనంగా ఉండాలి.

ఎవరైనా కొనుక్కున్న వస్తువుకాని, బట్టలు కాని చూపిస్తే తమకు నచ్చకపోతే వారి ముఖాన్నే యీసడించడం కొందరికి అలవాటు. నాణ్యతలేదనో, ఫలానా వారు దాన్నే అందులో సగం ధరకే కొన్నారనో అనేస్తారు. మనస్సులో మాట పైకి చెప్పివేయడం మంచిదే అయినా అది యితరులను బాధించే ధోరణిలో ఉండరాదు.

ఒక తరహా వ్యక్తులు సంభాషణలో యెప్పుడూ యితరులను విమర్శించడం, యితరులను హేళన చేయడం చేస్తూ ఉంటారు. ఎవరైనా వారి నదిరించి జవాబు చెప్తే కోపం తెచ్చుకొని మాటలతో ప్రాణాలు తోడేస్తారు. ఇటువంటి మనుష్యులు తమకు అయిష్టులైనవారిని ఎలుకమీద, పిల్లిమీద పెట్టి సూటిపోటీ మాటలు విసరడం, వారిని లోకం దృష్టిలో దుర్మార్గులుగా నిలబెట్టడానికి తాపత్రయపడటం చేస్తూ ఉంటారు. ఇతరులను గాయపరచడం అమానుషమని, ముఖం మీద యేమీ అనకపోయినా వెనుక తమను కూడ విమర్శించేవారుంటారని వీరు గ్రహించరు. ఇష్టంలేని మనుష్యులతో మాట్లాడకుండా, మౌనంగా ఉండటం ఉత్తమం. కాని విరోధం వచ్చిందని మాటలతో ఒకరినొకరు బాధించుకోవడం నాగరిక లక్షణం కాదు.

పిల్లలముందు సంసారపు గొడవలు మాట్లాడటం, భార్యాభర్తలు ఒకరినొకరు యీసడించుకోవటం చేస్తే పిల్లలకు వారియందు ఒక విధమైన నిర్లక్ష్యభావం యేర్పడగల ప్రమాదం ఉంది.

మాటలు మహాపదునైనవి. ఎంత సాన్నిహిత్యం ఉన్న వ్యక్తులనైనా ఒక్కొక్కసారి విరోధులుగా చేసేస్తాయి. సున్నితమైన చక్కని మాటలతో యితరులను నొప్పించకుండా మాట్లాడటం ప్రతివారూ అలవర్చుకోవాలి. పిల్లల యెదుట, కోపం వచ్చినపుడు సాధ్యమైనంతవరకు జుగుప్సాకరమైన మాటలు అనకుండా ఉండటం నేర్చుకోవాలి. సందర్భోచితంగా, నాజూకుగా మాట్లాడే పెద్దల పెంపకంలో పిల్లలుకూడ వయస్సుకు తగిన, చక్కని సంభాషణ చేయగలిగే నేర్పరులవుతారు.

సూరదాసు గేయసాహిత్యం

హిందీ సాహిత్యంతో యే కొద్ది పరిచయమున్న వారైనా సూరదాసు పేరు తెలియని వారుండరు. సూరదాసు హిందీ సాహిత్య గగనంలో సూర్యునివంటివాడని ప్రసిద్ధి. అతని గేయ సాహిత్యం మేలిమిబంగారంతో చేయబడ్డ అమూల్యభూషణం. శ్రీకృష్ణ భక్తి పారవశ్యంలో తన్ను తాను మరిచిపోయి కరిగిపోయి ఆలాపించిన ఆ గేయాలు హిమత్పర్వతములపైని మంచు కరిగి స్రవించిన అమృతధారలవలె, మధురంగాను, స్వచ్ఛంగానూ, పవిత్రంగానూ వుంటాయి.

సూరదాసు ధీరలలితుడైన శ్రీకృష్ణుని గురించి వ్రాయడానికి, అతని క్రీడాకలాపాల్ని గురించి మనోహరంగా పాడడానికి, కోమలము, సున్నితము, మధురమూ సమ్మిళితమైన వ్రజ భాషనే వుపయోగించాడు. ఆయన కంటిముందు కనిపించిన బాలకృష్ణునిలీలలు నిజంగా, స్త్రీ హృదయాన్ని వాత్సల్యంతోనూ, ప్రేమతోనూ నింపివేస్తాయి. మామూలు తల్లి మనస్సుకి కూడా తట్టనటువంటి సూక్ష్మవిషయాలు నెన్నింటినో ఆయన తన కవిత్వంలో ఎంతో సహజంగా చూపించాడు. మాతృహృదయంలోని వాత్సల్యాన్ని పెల్లుబుకునట్లుచేసే అతని గేయాలు నిజంగా చదివి ఆనందించతగ్గవేగాని చెప్పితే సరిపోయేవిగాదు. విషయబాహుళ్యం దృష్ట్యా సూరదాసు ఎన్నుకొన్న విషయం చాలా తక్కువ. కాని తను తీసుకుని వ్రాసిన ఏ విషయంలో యింకొకరు చెప్పడానికి ఏమీ లేకుండా అంత సూక్ష్మంగా సునిసితంగా వ్రాశాడు.

కృష్ణుడు వుయ్యాలలో నిద్రపోతున్నాడు. యశోదమ్మ ఇంపుగా పాటపాడి నిద్దరపుచ్చుతోంది. నిద్రపోయాడనుకొని, యింట్లో పరిచారికలని పెద్దగా మాట్లాడవద్దని సైగజేసి చెప్పింది. అప్పుడు శ్రీకృష్ణుడు కొంచెం కనురెప్పలుమూసి, కెంపులుజిమ్మే అధరాలు కదిలిస్తూ నవ్వుతున్నాడట, పాట ఆగిపోయేసరికి లేచాడు. మళ్ళీయశోదమ్మ పాటపాడి నిద్రబుచ్చుతుంది. ఈవిధంగా శైశవందాటి బాలకృష్ణుడు అమ్మా, నాన్నా, అన్నయ్యాఅనటం నేర్చుకున్నాడు.

ఆ చంద్రముఖంలో మెరిసే అతని దంతకాంతి అనే మెరుపుతీగముందు అసలు చంద్రుడు, మెరుపుతీగ దిగదుడుపేనంటాడు సూరదాసు. కాలి బొటనవ్రేలు నోట్లో వేసుకోవడం, చేతిలో వెన్నముద్ద, మూతికి పెరుగు, ఒంటిమీద దుమ్ముతో కృష్ణుడు పారాడివస్తాడు. కృష్ణుని బాలవినోదం చూడడానికి దేవతలంతా వచ్చారట అని సూరదాసు వ్రాస్తాడు. శ్రీకృష్ణుడు ఈవిధంగా పారాడివస్తూ నిగనిగ మెరిసే స్తంభంలో తన నీడనిచూసి వేరే బాలుడున్నాడనుకొని పట్టుకోవడానికి, వెన్న పెట్టడానికి గబగబావస్తాడు. అంతేకాదు నందభామిని నందనందనునికి నడక నేర్పిస్తోంది. చెయ్యిపట్టుకుని నుంచోపెడుతుంది, ఒకటి రెండు తప్పటడుగులువేస్తాడు. ఆ తరువాత కొంచెం కొంచెంగా తప్పటడుగులతో పడుతూ లేస్తూ గడపదాకా వెళ్ళి తిరిగి తల్లి దగ్గరికి వస్తాడుట. చిన్నపిల్లలు మొండిపట్టు పడితే కొండమీద కోతైనా దిగిరావాలంటారు. అల్లాగే కృష్ణుడు కూడా ఆకాశంలో చందమామని చూపించి ఆడిస్తూవుంటే అది ఆడుకోడానికి యివ్వమంటాడు అదికూడా పెద్దవెన్నముద్ద అనీ, తినడానికి తెచ్చియివ్వమనీ మారాంచేస్తాడు. ఇంక ఎన్ని వస్తువులు యిచ్చినా పట్టువదలడు. అప్పుడు యశోదమ్మ ఒక కుండలో నీళ్ళుపోసి,

దాని నీడలో చంద్రుణ్ణి చూపి అదే వెన్న అంటుంది. కృష్ణుడు చెయ్యిపెట్టి వెదుకుతూ వెదుకుతూ తను అడిగిన సంగతి మరిచిపోతాడు. కృష్ణుడికి వెన్న, పెరుగు, పళ్లు మిగతా అన్నీ యిష్టమేకాని పాలంటే గిట్టదు. పాలు త్రాగించాలని యశోదమ్మ అల్లిబిల్లి కబుర్లు చెప్పి, నాయనా! పాలు త్రాగితే నీ జుట్టు చక్కగా అందంగా పెరుగుతుందిరా, బలరాముడి జుట్టు చక్కగా పొడుగ్గా వుండును అని, చెప్పి పాలగిన్నె చేతికిస్తుంది. కృష్ణుడు ఒక గుక్కెడు పాలు త్రాగాడో లేదో యింకోపక్క జుట్టు చేత్తో చూసుకుంటూ "అమ్మా! నాకు యిప్పటికి పాలు తాగమని బలవంతంచేసి యిచ్చావు, కాని జుట్టుమాత్రం పెరగలేదే అంటాడు. ఆటపాటల్లో బలరాముడు కృష్ణుణ్ణి యేడిపిస్తాడు. తల్లి దగ్గర నేరం చెప్పడానికి వచ్చాడు కృష్ణుడు. "అమ్మా! నీవు ఎప్పుడు చూసినా నన్నే తిడతావే అన్నని ఒక్కమాట కూడా అనవు. అందుకని వాడు నన్ను నలుగురి ముందు బాగా ఏడిపిస్తున్నాడే. గోపాలురందరి తోటి చిటికెలువేసి, చప్పట్లు తట్టి, నీవు యశోదానందుల కొడుకువి గాదు, నిన్ను వాళ్లు కొన్నారని చెప్పి ఎగతాళి జేస్తున్నాడు. యశోదానందులు యిద్దరూ ఎఱుపే నీవు మాత్రం నల్లగా వున్నావు. కాబట్టి వాళ్ల కొడుకువి గాదురా, అని ఏడిపిస్తున్నాడే" అని బుంగమూతి పెట్టుకుని చెప్తాడు యశోదమ్మ తన ముద్దులపట్టికి నచ్చచెప్పి, బలరాముణ్ణి కేకలేస్తుంది.

ఒక గోపిక మజ్జిగచేయడం, కిటికీలోనుంచి చూస్తారు. పొంచివుండి ఆమె బయటికి వెళ్లగా చూసి, ముఠా అంతా లోపలికి వెళ్ళి, పెరుగు, వెన్న తిన్నంత తిని, మిగతా పెరుగు క్రిందపారబోసి, కుండలు పగలగొట్టిపోతారు. యింకో రోజు యింకో యింట్లో, వెన్న దొంగిలించి తిని, వుట్టితెంపి, కిందపారేసి వుయ్యాలలో నిద్రపోతున్న పసిబాలుని కింద పడుకోబెట్టి గిచ్చి ఏడిపించి మరీపోతారు. ఇంకొకరి యింట్లో ఆవుదూడ తోకకీ, చిన్నపిల్లవాడి మొలతాడుకీ కలిపికట్టి వెళ్ళిపోతారు. ఇక ఈ దుండగీడుతనం భరించలేక గోపికలు వచ్చి యశోదమ్మకి మొరపెట్టుకుంటారు.

అప్పుడు ఏమీ ఎరుగని నంగనాచిలా తర్కబద్ధంగా వాదిస్తాడు గదా! "అమ్మా, వీళ్ళు చెప్పేమాటలు నమ్మదగినవేనా అంత ఎత్తున వుట్టికట్టి వుంటుందికదా, నా యీ చిన్నచిన్న చేతుల్తో ఎలాగ అందుకోగలనే! మిగతా పిల్లలందరూ కలిసి నా మూతికి పెరుగుపూసి పారిపోయారే. అదిచూసి వీళ్ళు నేనే అంతఅల్లరీచేశానను కుంటున్నారే." అంటాడు గోపికలందరూ కలిసిదొంగని దొంగిలిస్తూవుండగా పట్టుకోవాలని నిర్ణయించుకుని వెళ్ళారు. ఒకరోజు వాళ్ళ అదృష్టవశాత్తూ అట్లాగే పెరుగుకుండలో చెయ్యిపెట్టి వెన్నతీసి తింటూవుండగా పట్టుకొని తీసుకొస్తారు. తప్పించుకోవడానికిగానీ, కేసు రద్దు చేయడానికిగానీ ఏమాత్రం వీలులేదు. అయినా మన నల్లనయ్య వుపాయం చాకచక్యం చూడండి. "అమ్మా, కనుచీకటిలో మనయిల్లే ననుకొని లోపలికి వెళ్ళానే. తీరా వెళ్లిన తరువాత పెరుగులో చీమలున్నాయని, బైటికి తీసి పారెయ్యాలనీ చెయ్యి పెట్టానో లేదో వీళ్లు పట్టుకున్నారే" అంటాడు. అతని యుక్తికీ, నేర్పుకి గోపికలు నవ్వి యింటికి వెళ్ళిపోతారు. ఈ విధంగా మనస్సుని చూరగొనే ఎన్నో ప్రసంగాలు సూరదాసు రచించిన బాలకృష్ణుని లీలల్లో చూడగలం.

శ్రీమతి ఈరంకి లక్ష్మీదేవి



దేశం కోసం

నాగలింగం అలా జరుగుతుందని ఎప్పుడూ ఊహించనైనా లేదు. అంతా కలలా జరిగిపోయింది. మాధవి ఒక కసుగందుని తమ ప్రేమఫలంగా దిగవిడిచి ఇహలోకయాత్ర చాలించింది. అన్నిటికన్నా విచారకరమైన విషయం ఏమంటే అతడు మాధవితో గడిపిన మధురక్షణాల్ని మరచిపోలేక పోతున్నాడు. లోకం ఊరుకోదుగా. ఎప్పుడూ ఏదో ఒకటి పొడుస్తూనే ఉంటుంది. వివాహం చేసుకుంటే 'అవ్వ! పెళ్ళాంచచ్చి పదిరోజులైనా కాలేదు. అప్పుడే పసుపుబట్టల్తో పెళ్ళికొడుకైనాడంటుంది' చేసుకోకపోతే 'అయ్యో, రాత. చచ్చినవాళ్ళతో మనమూపోతామా ఒక పెళ్ళాంచస్తే ఆజన్మాంతం అలా బ్రహ్మచారిలానే ఉండిపోతారా? ఇదేం విడ్డూరం అని నోరు నొక్కుకుంటుంది.

అంతదాకా ఎందుకు? అసలు అతని తల్లే, ఆమాట అన్నది. అనటమే కాదు; ఇతరులచేత చెప్పించింది. అయినా నాగలింగం నాలిక కదపలేదు.

బెల్లం కొట్టినరాయిలా ఊరుకున్నాడని ఊదర కొట్టేసింది తల్లి మంగమ్మ.

నాగలింగం ఇక వివాహానికి 'ఊ' అనక తప్పింది కాదు. అయితే ఓ షరతు పెట్టేడు నాగలింగం. బైటి సంబంధం చేసుకోనని పట్టుపట్టేడు.

మాధవి చెల్లెలు మధుమతి చాలా చిన్నపిల్ల. అయినా పిల్లవాడి భవిష్యత్తుదృష్ట్యా ఆ సంబంధమే ఖాయం చేసుకున్నాడు. పిల్లపెరిగి పెద్దదయ్యేదాకా ఓపికపట్టేడు. నాగేశ్వరరావుకీ మధుమతికి వయస్సు అట్టేతేడాలేదు. పదెనిమిది సంవత్సరాలు మాత్రమే.

మధుమతి కాపరానికివచ్చి నాలుగేళ్ళు దాటింది. మధుమతికి ఇద్దరుసంతానం కలిగేరు. మాధవీ, సుమలత.

అప్పటికి నాగేశ్వరరావు. స్కూలుఫైనలు చదువుతున్నాడు.

"ఏమండోయ్. మీవాడి సంగతి విన్నారా?"

"ఏవిటే"

"వాడు చదువుకోవటంలేదు. ఎప్పుడూ సినిమాలూ, షికార్లూను. వాళ్ళ రామారావు లేడూ, వాడు చెప్పాడు,"

"అలాగా?"

"అలాగా అని చప్పరించేస్తున్నారే. వాడుచదువుకోక సర్వనాశనమై పోతూంటేనూ. చిప్పచేతికి వచ్చిననాడు కానీ తెలీదు."

"సరేలేవే? వాడు చదువుకోవటం లేదని ఎవరో చెప్తే నమ్మావూ? నిజమెంతో, అబద్ధమెంతో"

"అయితే అబద్ధం చెప్పటానికి అతడికేం అవసరం? అంతేనా? పుస్తకాలు చాలావరకు అమ్మేశాడుట."

"ఇదుగో నేవ్? చెప్పుడుమాటలు వినకు. చెడిపోతావ్? నిజంగా వాడు అమ్మేడంటావా?"

"సరే అయితే, మీకంత నమ్మకం లేకపోతే అతగాడ్ని పిలిచి కనుక్కోండి. మీకే తెలుస్తుంది. అప్పుడే అందురుగాని అనవలసిన నాలుగుమాటలూను"

"ఒరే నాగేశూ"

"........."

"నాగేశ్వరరావ్"

"... .. .."

"నిన్నేరా? పలకవేం?"

అడుగులో అడుగేసుకుంటూ వచ్చి తలవంచుకు నిలబడ్డాడు.

"ఏంరా? చదువుతున్నావా?"

"ఆ...ఆ చదువుతు...తున్నా"

"పుస్తకాలన్నీ ఉన్నాయా?"

"లే......లేవు"

"ఏం? ఏమైనాయి?"

"స్నే...స్నేహితుడు అడిగితే ఇచ్చాను"

"అయితే సాయంత్రం పట్టుకురా"

"వా... వాడులేడు ...ఊరికి పోయాడు."

"ఎప్పుడొస్తాడు?"

"వాళ్ళ నాయనమ్మకి జబ్బుచేసిందట- వెళ్ళాడు. ఎప్పుడొస్తాడో ఏమో"

"అలాంటి వాడికెందుకిచ్చావ్? అసలు చదువు మీద శ్రద్ధఉన్నవాడివైతే అలా పుస్తకాలు ఇతరులకి పంచిపెడతావుట్రా?" చంప ఛెళ్ళుమనిపించాడు నాగలింగం.

"ఏవిట్రా అది. పిల్లవాడ్ని చంపేస్తావుట్రా. చంపెయ్యరా, వాడ్ని నివ్వు బ్రతకనివ్వవని ఆనాడేఅనుకున్నారా? పెళ్ళాం మాటలువిని పసివెధవని చావబాదుతావట్రా. నన్ను చంపరా. నీకసీ, దానికసీతీరుతుంది" ముసలమ్మ ముందుకొచ్చింది.

"అమ్మా. నీవు ఊరుకో. వెధవకి భయంలేదు, భక్తి లేదు. వాడిష్ట మెచ్చినట్టు ఆడుతున్నాడు. నేనిక్కడలేనుకదా అని బడుద్ధాయిలా తిరుగుతున్నాడు నీవు మధ్యరాకు"

"అదేవిట్రా, చదువుకుంటే మాత్రం పిల్లలు తిరగరుట్రా. ఎప్పుడూ కొంపలో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటారుట్రా."

"అని ఎవరన్నారమ్మా? తిరిగితే మాత్రం అర్థం ఉండద్దూ? పుస్తకాలన్నీ అమ్మేసి వెధవ సినిమాలకీ షికార్లకీ తిరుగుతున్నాడు."

"వాడు ఎవడో స్నేహితుడి కిచ్చానంటున్నాడు కదట్రా."

"అదోవంక. అలా కాకపోతే మరెలా చెబుతాడు? స్నేహితుడూ లేదు చట్టుబండలూ లేదు. అన్నీ అమ్ముకుని ఆటలాడుతున్నాడు. వెధవకి. తాట వలుస్తా. ఏమనుకుంటున్నాడో, డొక్కచీరేస్తా" అంటూ మీదికి పోయాడు.

"అదేవిట్రా. ఒక్కగానొక్క పిల్లాడు. చావబాదితే చచ్చిపోడుట్రా. వాడ్ని చంపితే మీకేం ఒరుగుతుందిరా? తల్లిలేని పసివెధవ."

"అదుగో అలా అనే నెత్తికెక్కించుకుంటున్నావు. వాడు బాగుపడాలని ఉంటే మధ్య కల్పించుకోకు తెలిసిందా?"

"పోనీరా, చదువుకోకపోతేనేంరా? వాడి పొట్ట వాడు పోషించుకోలేడా? ఇస్కూలుఫైనలు చదువుతున్నాడుగా. వాడి భారం నీకేమీ మొయ్యనక్కర్లేదులేరా."

"ఇదుగో అలాఅనే వాడ్నిపాడుచేస్తున్నావు. వాడు చదివి పెద్దవాడు కావటం నీకిష్టం లేదా అమ్మా,"

"అని ఎవరన్నార్రా రాతలో లేంది వాతబెట్టుకుంటే వస్తుందా? వాడి గీతలో ఉంటే ఎల్లా తిరిగినా ప్యాసవుతాడు. ఇక వదిలిపెట్టరా. చాలు" అంటూ "రారా పిచ్చిసన్యాసీ!" అంటూ నాగేశ్వరరావు చెయ్యిపట్టుకొని తీసుకుపోయింది మంగమ్మ.

"చూశారా, ఆవిడే వీడ్ని పాడుచేస్తోంది. ఇంక వాడేం చదువుకుంటాడు?"

"చావనీ? నేనేం చేసేది. ఆవిడ వాడ్ని నెత్తికెక్కించుకుంటోంది. వాడెలా బాగుపడతాడు?"

"ఇప్పుడలాగే అంటారు. రేపు చెడిపోతే అందరూ మనల్నే అంటారు. వాడి సంగతి పట్టించుకోలేదని."

"అయితే నన్ను చావమన్నావా?" అంటూ వెళ్ళిపోయాడు నాగలింగం.

****

శ్రీమతి మునుపల్లె సరోజినీదేవి

****

2

"ఏమండోయ్, నాగేశ్వరావు కనిపించటంలేదు" అన్నది గాబరాపడుతూ మధుమతి.

"ఏం ? లేడూ ? ఎక్కడికి పోయాడు ?"

"రాత్రి రాలేదు. సినిమాకేమైనా వెళ్ళాడేమో అతడే వస్తాడులే అని ఊరుకున్నాను. తెల్లవారి చూస్తే లేడు."

"ఎక్కడైనా స్నేహితులింటికి వెళ్ళాడేమో ?"

"ఏమో ? వెళ్ళి కనుక్కురండి. మళ్ళీ అత్తయ్య గొడవచేస్తుంది."

"సరే. ఆ ఉత్తరీయం ఇలా అందుకో" అంటూ ఉత్తరీయం బుజానవేసుకొని బయలుదేరాడు నాగలింగం. మధుమతికి మనస్సులో మనస్సులేదు. ఎంత రభస అవుతుందో ఏమిటో ? ఏ పనీ చెయ్యబుద్ధి కాలేదు. పొయ్యికూడా రాజెయ్యలేదు.

"ఏమే అమ్మాయ్, అబ్బాయి ఏడీ ?"

"మీ అబ్బాయా ?"

"కాదు. మనవడు."

మధుమతి పెదవులు అదిరాయి. మాట తడబడుతోంది.

"ఎక్కడైనా స్నేహితులింటికి వెళ్ళాడేమో."

"వాడలాంటివాడు కాదే. అర్ధరాత్రి అయినా యింటికే వస్తాడే."

"ఆయన్ని పంపాను. కనుక్కొస్తారు."

"ఇంకేం కనుక్కొస్తాడు ? వాడెటో పరారై ఉంటాడు. నాకు తెలుసు. వాణ్ణి మీరిద్దరూ బ్రతకనివ్వరని ఎప్పుడో అనుకున్నా" అంటూ ఏడ్పుకి లంకించుకుంది.

"ఓరి నాయనా ? నన్ను విడిచిపోయావుట్రా నా తండ్రీ, ఇన్నేళ్ళు కంటికి రెప్పలా కాచి రక్షించాను కదరా నా నాయనా."

"ఛీ - అదేమిటత్తయ్యా, అలా ఏడవటం బాగుండదు. నలుగురూ చూస్తే నవ్విపోతారు."

"అవునే నా తల్లీ. నలుగురూ చూచి నవ్వేట్లే చేశావే నా తల్లీ. పండంటి కుర్రాణ్ణి పరారుచేశావే నా తల్లీ! నా బిడ్డని నాకు కాకుండా చేశావే మహమ్మారీ, కళ్ళల్లో వత్తులువేసుకు పెంచానే వాణ్ణి ? నా బాధ నీకెలా తెలుస్తుందే నా తల్లీ."

"ఇదుగోండి. చదువుకోమని చెప్పటం తప్పా ? ఇదేనా నేనుచేసిన నేరం. ఆకుకి అందకుండా, పోకకి పొందకుండా పాడైపోతే ఎలాగో చెప్పండి? అప్పుడూ మీరంతా నన్నే ఆడిపోసుకుంటారుగా. అదుగో ఆయన వస్తున్నారు."

"ఏమిటమ్మా! ఆ శోకాలు."

"లేదమ్మా. ఎవరింటికీ రాలేదన్నారు."

"ఇంకేం కనిపిస్తాడురా నా తండ్రీ. వాణ్ణి చితకతన్ని వెళ్ళగొట్టావురా నా తండ్రీ, నా పిల్లవాణ్ణి నాకు కాకుండా చేశావురా."

"లేమ్మా, పద భోజనం చేద్దాం. వాడెక్కడికి పోయాడో ఆచూకి తెలిందే ఎలా వెతకటం ?"

"ఇంకేం భోజనంరా నాయనా ?" కన్నతండ్రివి నీకే చీమంతైనా బాధ లేకపోతే ఇంకెవరికుంటుందిరా? వాడు నాకు కనిపిస్తేనేకాని నేను పచ్చి మంచినీళ్ళుకూడా గొంతులో పోసుకోలేనురా నా తండ్రీ. ముందు వాణ్ణి వెతికిపట్టుకు రారా నాయనా."

"ఏమిటండోయ్ అత్తయ్యగారూ ? ఏమిటలా రాగాలు తీస్తున్నారు ?" అంటూ వచ్చాడు గోపాలం.

"ఏమీలేదు నాయనా, నా మనవడు కనిపించటంలేదు. ఏ అఘాయిత్యం చేశాడో."

"మధూ. ఏమిటీ సంగతి ?"

"ఏముందిరా? మీ బావగారు చదువుకోవటంలేదని కేకలేశారు. అంతే. అందుకోసం మాయమైనాడు. ఎక్కడికి పోయాడో ఏమో."

"అవునే తల్లీ. నీకు అన్నీ అంతగానే కనిపిస్తాయి. వాడేమైనాడోనని నేను బెంగెట్టుకు చస్తుంటే."

"అయితే ఏమిటి చేద్దామంటావ్ గోపాలం ? ఈ ఆడవాళ్ళ గొడవతో అసలు మతే పోయేట్లుంది."

"పేపర్లో వేయించు బావా ?"

"పడిసినట్లుంది. పేపర్లో వేయించిన వాళ్ళందరూ దొరికి ఏడుస్తున్నారంటావా ?"

"అయితే ఎలా వెదుతావ్? బంధువులందరికీ ఉత్తరాలు వ్రాయి."

"మ్చ్. అందువల్ల లాభమేమిటోయ్?"

"ఎక్కడున్నాడో క్లూ తెలిస్తే లాక్కురావచ్చు."

'పడ్డినట్లే ఉంది. అందుకేగా నీ సలహా అడగటం.'

"పోస్ట్ సార్."

'ఉత్తరమోయ్. అందుకో.'

"అక్కాయ్‌బావోయ్. చిక్కాడు మిడతంభొట్లు."

"ఇంకేమిటీ? ఎక్కడున్నాడుట?"

"హైదరాబాదు వెళ్ళిపోతున్నాడట. సైన్యంలో చేరుతున్నాడట."

"అయితే పదవోయ్. పట్టుకుందాం."

"వెళ్ళరండి నాయనా. నా బిడ్డ ఎలా ఉన్నాడో ఏమో? తిండీ తిప్పలూ లేకుండా ఎలా ఉన్నాడో" కళ్ళు తుడుచుకుంది.

"పదవోయ్ గోపాలం."

"భోజనంచేసి వెళ్ళండి నాయనా."

"నీవు తినవా అమ్మా."

"నాతిండికేంలే నాయనా. వాడు క్షేమంగాఉన్నాడని తెలిస్తే అంతేచాలు. ఒకరోజుతినకపోతేచావనులే."

"అయితే వాడు దొరికేదాకా తినవంటావా అత్తయ్యా."

"అవునయ్యా! వాడెలా ఉన్నాడో తెలియకుండా ఈ పాడుపొట్ట నింపుకునేదా? వెళ్ళండి. వెళ్ళి వాణ్ని నాకు తెచ్చి చూపించండి."

3

"అమ్మాయ్, ఏమేవ్? నిన్నే నే."

"ఏమిటత్తయ్యా, పిలిచారా?

'అవునే అబ్బాయి వెళ్ళి నెల కావస్తున్నది కదా. ఇంకా ఉత్తరం ముక్క వెయ్యలేదేమొ.'

'ఏమో అత్తయ్యా. వాణ్ని ఇంకా వదిలిపెట్ట లేదేమో. అందుకని వ్రాయలేదేమో.'

'అయితే వదిలిపెట్టరంటావా?'

'ఎందుకు వదిలిపెట్టరూ? అయినా చేర్చుకున్నంత త్వరగా విడిచిపెడతారా?'

'అదీ నిజమేనేవ్? ఏమీ తోచటంలేదే అమ్మాయ్.'

'భగవన్నామ స్మరణ చెయ్యండి. ఆయనే అందరి కష్టాలూ ఈదేర్చే ప్రభువు.'

'పోస్ట్' పోష్టుమాన్ కేక.

'అదుగోనేవ్. అమ్మాయ్. తీసుకునిరా. కాస్త చదివి వినిపించవే తల్లీ.'

'అమ్మగారికి నమస్కారములు. మేము క్షేమము. అబ్బాయి క్షేమము. మీరు క్షేమమే అని తలుస్తాను. అబ్బాయిని విడిచిపెట్టమన్నారు. విదేశీయులు దండెత్తి వస్తుంటే దేశం ప్రమాదస్థితిలో ఉంది. అలాంటప్పుడు చేర్చుకున్నవారిని విడిచిపెట్టమనటం భావ్యంకాదు అన్నారు. వాణ్ని వదిలిరాలేక, వచ్చినా నీవు బ్రతకవనే భయంతో నేనూ గోపాలం యిద్దరం కూడా సైన్యంలో చేరిపోయాము. వాడు లేకుండా నేను ఒక్కడ్నే వచ్చినా ముఖం నీకు చూపించలేను. అందువలన ఇలా చేశాను. నీవు అన్యథా భావించవద్దు. డబ్బు త్వరలో పంపగలను. జాగ్రత్తగా ఉండండి. పిల్లలు జాగ్రత్త. వారం వారం ఉత్తరం వ్రాయండి. గట్టిగా నిట్టూర్చింది మధుమతి.

"అమ్మాయ్. ఇదేమిటీవాడు పోయాడనే ఏడుస్తుంటే వీడు కూడా పోయాడేమే. అయ్యో రాత. భయపడి చేరిపోతాడా? ఈ మాయదారి యుద్ధందేనికొచ్చిందే! వాడినట్టి ఉప్పలాయి వెధవ! ఊరందరి సొమ్మూ నాకు కావాలనే వెధవ. అవ్వ కలికాలం వాడి కర్మానవాడు పడివుంటే వాళ్లకేం వచ్చిందంట పొయ్యేకాలం?"

"అత్తయ్యా మనం చేసేదేముంది? మనంకూడా ఈ విషమ పరిస్థితుల్లో మనకు చేతనైన సాయం చేద్దాం'

'ఆడముండలం! ఏం చేస్తామె తల్లీ?

'ఎందుకు చెయ్యకూడదత్తయ్యా. సైన్యంలో చేరిన వాళ్ళకి కావలసిన వస్తువులన్నీ తయారు చేయవచ్చు. ఊరగాయలు, తినుబండారాలూ, కోట్లు, పాంట్లూ, చొక్కాలూ, ఉన్నిదుస్తులూ అన్నీ తయారుచెయ్యవచ్చు.'

'నీ ఒక్కదానిపై ఏం చేస్తావే తల్లీ'

'నేను ఒక్కదాన్నెందుకవుతాను అత్తయ్యా. మనకి తిండికొదవే కాని మనుషుల కొదవలేదు. మన కర్తవ్యం మనం సరిగా నిర్వర్తిస్తే దేశసేవ చేసినట్లే. ప్రతి ఒక్క స్త్రీ, పురుషుడూ వాళ్ళవాళ్ళ బాధ్యతల్ని గుర్తెరిగి పనిచేస్తే ఎందుకు జయించలేమూ? అంతిమ విజయం మనదే! మనవాళ్ళంతా సురక్షితంగా తిరిగి రావాలని ప్రార్థిద్దాం! దేశంకోసం కావలసినవన్నీ సమకూర్చటమే స్త్రీలమైన మనకర్తవ్యం! యుద్ధంలో చేరకపోతేనేం? యుద్ధంలో ఉన్నవారికి అవసరమయ్యే వస్తువుల్ని అందిద్దాం! దేశానికి పనికివచ్చేవిధంగా శిక్షణ పొందాలి. మనమూ మనపిల్లలూ సోమరితనం వదిలిపెట్టి పరిశ్రమించాలి. పట్టుదలంటూ ఉంటే సాధించలేనిదేమీలేదు అత్తయ్యా.'


'సరే తల్లీ. అయితే నాకుకూడా ఏదైనా నేర్పించు తల్లీ భగవంతుణ్ణి స్మరిస్తూ ఉడతాభక్తితో నాకు చేతనైంది చేస్తాను.'

'పద అత్తయ్యా మహిళామండలికి పోదాం. వాళ్ళు ఏవిధంగా చెప్పితే, ఏమినేర్పితే అది నేర్చుకుందాం. మనమూ ప్రయోజకులమంటూ చాటుదాంపద.'


"పద తల్లీ. కాలంమారింది. మేమూమారాలి మీతో పద,పద'

అత్తాకోడళ్ళు చెయ్యీ, చెయ్యీకలిపివెళ్ళారు. ★

ఆంధ్రమహిళాసభ-హైద్రాబాదు



దసరా వుత్సవాలు



బొమ్మలకొలువు



Printed and Published by N. R. Chendur at Andhra Mahila Press, 7-A, Rosary Church Road, San Thome, Madras-4. Hony. Editor: Mrs. Malati Chendur